సీజనల్ దోపిడీ

- అడ్డగోలుగా దోచుకుంటున్న ప్రయివేటు ఆస్పత్రులు
- జ్వరానికి వేలల్లో వసూలు
- రోగుల జేబులకు చిల్లు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరిగింది. ఇదే అదునుగా ప్రయివేటు ఆస్పత్రులు రోగుల జేబులు ఖాళీ చేస్తున్నాయి. టెస్టుల పేరుతో డబ్బు లు గుంజుతున్నారు. అవసరం లేకపోయినా అడ్మిట్ చేసుకుని టూ వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారు..

జ్వరంతో ప్రయివేటు ఆస్పత్రికి వస్తే వెంటనే రక్త పరీక్ష పేరిట రూ. 300 నుంచి రూ. 500 వరకు వసూలు చేస్తున్నారు. జ్వరం తగ్గితే సరి.. లేదంటే రకాల టెస్టులు, స్కానింగులు చేయిస్తున్నారు. రోగి పరిస్థితి తీవ్రంగా లేకపోయినా, మందులు వాడితే తగ్గిపోయే పరిస్థితి ఉన్నా కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు అనవసరంగా అడ్మిట్ చేసుకుంటున్నాయి. మూడు నాలుగు రోజులు ఆస్పత్రిలో ఉంచుకుని రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు బిల్లు వేస్తున్నారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా సుమారు 70 ఆసుపత్రులకు అనుబంధంగా ల్యాబ్లు ఉన్నాయి. మరో 35 ల్యాబ్లు ప్రత్యేకంగా ఏర్పాటయ్యాయి. అధికారిక లెక్కలో వందల సంఖ్యలో చిన్నపాటి ల్యాబ్లు అనుమతులు లేకుండానే సుమారు 100 వరకు నడుస్తున్నాయి. నిబంధనల ప్రకారం వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు తప్పనిసరిగా జిల్లాలో పర్యటించి ఆయా



కేంద్రాలను తనిఖీ చేయాల్సి ఉండగా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. చాలామందికి అర్హత లేకపోయినా ల్యాబ్ టెక్నీషియన్లుగా చేర్చుకుంటున్నారు. ఫలితంగా వారిచ్చే రిపోర్టులు సరిగా ఉన్నాయా ? లేదా ? అని కూడా తెలియని పరిస్థితి నెలకొంది. పెద్దాస్పత్రి ఎదురుగా ఉన్న కార్పొరేట్ ల్యాబ్లతోపాటు చాలావాటికి అనుమతులు లేవు.

ప్రైవేటు ల్యాబ్ నిర్వాహకులు ఏజెంట్లను పెట్టుకుని పెద్దాస్పత్రికి వచ్చే రోగులను అక్కడికి తీసుకెళుతున్నారు. పెద్దాస్పత్రిలో కొన్ని పరీక్షలు బయటకు రాసిస్తుండటంతో ఇదే అవకాశంగా రోగులను తీసుకెళ్లి పరీక్షల పేరుతో వేలాది రూపాయలు దోచుకుంటున్నారు. ఆస్పత్రులో నిబంధనలు పాటించడం లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో వసూలుచేసే ఫీజులు, ఛార్జీల వివరాలను ప్రదర్శించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. అర్హతలేని సిబ్బందిని వైద్యసేవలకు ఉపయోగిస్తున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన వైద్యారోగ్యశాఖ అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ఆస్పత్రిలో ఎంత ఫీజు వేసినా నోరుమూసుకుని కట్టాల్సి వస్తోందని, దీంతో జేబులు ఖాళీ అవుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెల నెలా కమీషన్లు...

కొన్ని డయాగ్నోస్టిక్ కేంద్రాల ప్రతినిధులు వైద్యులకు నెలనెలా కమీషన్లు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు వైద్యులే ల్యాబ్లు పెట్టుకొని వైద్య పరీక్షల పేరుతో దోచుకుంటున్నారన్న విమర్శలున్నాయి. రోగులకు సంబంధించి వైద్య పరీక్షలు చేయాలంటూ వైద్యుడు ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేస్తే అందులో 30 నుంచి 40 శాతం వరకు కమీషన్లు ఇస్తున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- జాబ్ మేళా ద్వారా ఉపాధి - అర్హత ఉన్న వారందరికీ పింఛన్లు
- ప్రజాశక్తితో డిఆర్డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ సలీం బాష

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పొదుపు మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సలీం బాష వెల్లడించారు. అర్హత ఉన్న లబ్ధిదారులందరికీ వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద సామాజిక భద్రత పింఛన్లు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు జాబ్ మేళా ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నియమితులు కావడంతో ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు...

ఈ ఏడాది జిల్లాలో పొదుపు మహిళలకు ఎంత మేర రుణాలు మంజూరు చేయనున్నారు?

పిడి : జిల్లాలోని 21,209 పొదుపు సంఘాలకు బ్యాంకు లింకేజ్ ద్వారా మార్చి నాటికి రూ.824 కోట్లు మంజూరు చేశాం. బ్యాంకు లింకేజ్ ద్వారా పొందిన రుణాలతో ప్రతి పొదుపు మహిళ తమ కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసుకునేలా చేస్తున్నాం.

జిల్లాలో ఎంత మందికి పెన్షన్లను మంజూరు చేస్తున్నారు?

పిడి : వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద దాదాపుగా 16 రకాల పింఛన్లను లబ్ధిదారులకు ఇస్తున్నాం. ఇంకా అర్హత కలిగిన వారు పెన్షన్లకు దరఖాస్తులు చేసుకుంటే వారందరికీ కూడా ఇస్తాం.

వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకం కింద పొదుపు సంఘాలకు ఎంత చేయూత అందించారు?

పిడి : జిల్లాలో గత మూడు ఆర్థిక సంవత్సరాలుగా ఇప్పటివరకు రూ108.45 కోట్ల వైయస్సార్ సున్నా వడ్డీ ద్వారా సంఘాలకు లబ్ధి పొందడం జరిగింది.

జిల్లాలో వైఎస్ఆర్ బీమా కింద ఎంతమందిని నమోదు చేశారు.?

పిడి : వైఎస్ఆర్ బీమా కింద 5.05 లక్షల మంది పాలసీదారులకు ఈ బీమా పథకంలో నమోదు అయ్యారు. ఈ బీమా కింద త్వరగా లబ్ధిదారులకు పరిహారం అందేలా తగు చర్యలు తీసుకుంటాం.

గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించారా?

పిడి : జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శిక్షణ ఇవ్వడంతో పాటుగా జాబ్ మేళాల నిర్వహించి వారికి ఉపాధి కల్పించడం జరుగుతుంది.

పశ్చిమ ప్రాంతంలో నిరుపేద మహిళల ఆర్థిక అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

పిడి : పశ్చిమ ప్రాంతంలో నిరుపేద మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే ఆదోని ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ద్వారా అనేక చర్యలను జిల్లా కలెక్టర్ తీసుకుంటున్నారు. ఇందులో డిఆర్డిఎ తరఫున కూడా ప్రత్యేక దృష్టి సారించి తగు ఆర్థిక అభివృద్ధికి చర్యలు చేపడతాం.

ఎస్ఎఫ్ఐ తొలితరం నాయకులు

వెంకటరామిరెడ్డి ఇకలేరు

ప్రజాశక్తి- దేవనకొండ/కర్నూలు కార్పొరేషన్

వెంకటరామిరెడ్డి (ఫైల్)

ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కె.వెంకటరామిరెడ్డి(89) ఆదివారం కర్నూలులో తుది శ్వాస విడిచారు. దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామానికి చెందిన పెద్ద లక్ష్మిరెడ్డి, హనుమంతమ్మలకు వెంకటరామిరెడ్డి 1935 జులై 1న జన్మించారు. 1970వ సంవత్సరం డిసెంబర్లో తిరువనంతపురంలో జరిగిన ఎస్ఎఫ్ఐ వ్యవస్థాపక సమావేశంలో కర్నూలు జిల్లా నుండి పాల్గొన్న విద్యార్థి ప్రతినిధుల బృందానికి నాయకత్వం వహించారు. కర్నూలు జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చి ఉస్మానియా కాలేజీలో ఇంగ్లీష్ లెక్చరర్గా పనిచేస్తునే జిల్లాలో సిపిఎం ఉద్యమాభివృద్ధికి కషి చేశారు. ఒకవైపు వత్తి చేసుకుంటూనే జిల్లాలో పార్టీ పునర్నిర్మాణంలోనూ తన వంతు కషి చేశారు. తుదిశ్వాస విడిచే వరకు సిపిఎం అభిమానిగా, శ్రేయోభిలాషిగా జీవించారు. చివరి వరకు మార్క్సిస్టు ఆలోచన విధానంతో జీవనాన్ని సాగించారు. సిపాయిల తిరుగుబాటు ముందు (1857) గౌడప్ప నాయకత్వంలో పనులకు వ్యతిరేకంగా బ్రిటిష్ వారితో పోరాటం జరిగింది. ఈ పోరాటంలో వందలాది మంది చనిపోయారు పత్తికొండ తాలూకా దేవనకొండ మండలం తెర్నేకల్ ఉద్యమాల ఖిల్లాగా పేరుగాంచింది. సుందరయ్యలాంటి కమ్యూనిస్టులు వచ్చినప్పుడు వారి కుటుంబం ఆశ్రయం ఇచ్చేది. పత్తికొండ ఎమ్మెల్యేగా ఎర్రగుడి ఈశ్వర్రెడ్డి గెలుపునకు వెంకట్రామిరెడ్డి కుటుంబం పని చేసింది. తిరుపతిలో ఆయన వెంకటేశ్వర యూనివర్సిటీ ఏర్పడినప్పుడు డిగ్రీ కాలేజీ ఉండేది. అక్కడ చదువుకున్నారు. తర్వాత ఇంగ్లీషులో పీజీ చేశారు. మొట్టమొదటిసారి చిత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్గా పని చేశారు. ఆ తర్వాత కర్నూలు ఉస్మానియా కళాశాలలో ఇంగ్లీష్ డిపార్టుమెంటులో లెక్చరర్గా చేరారు. ఇక్కడే రిటైర్డ్ అయినారు. ఎస్ఎఫ్ఐ వ్యవస్థాపకులలో ఆయన ఒకరు. అతని భార్య సరస్వతి కూడా పట్టభద్రురాలు, ధనిక కుటుంబంలో పుట్టినప్పటికీ ఈయనతో వివాహం

వెంకటరామిరెడ్డి భౌతిక కాయానికి నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నేతలు

అయినప్పటినుండి కమ్యూనిస్టు భావా లను కలిగి ఉండి కమ్యూనిస్టులు సీనియర్ నాయకులు మధు లాంటి వారు ఉద్యమాల సందర్భంగా వచ్చిన వారి ఇంట్లో ఉండి ఆతిథ్యం పొందేవారు. వెంకటరామిరెడ్డికి కుమారులు ప్రకాష్రెడ్డి, రవీంద్రారెడ్డి ఉన్నారు.

సిపిఎం నేతలు సంతాపం : వెంకట్రామిరెడ్డి మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. ప్రభాకర్రెడ్డి, సిపిఎం కర్నూలు జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి. నిర్మల, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు , పిఎస్ రాధాకష్ణ జిల్లా కమిటీ సభ్యులు టి. రాముడు, ఎం. రాజశేఖర్ నగేష్ సంతాపం ప్రకటించారు. వెంకట్రామిరెడ్డి భౌతిక కాయంపై పుష్పగుచ్చం ఉంచి శ్రద్ధాంజలు ఘటించారు.

వెంకట్రామిరెడ్డి జీవితం నేటి తరానికి ఆదర్శం : నేటి తరానికి వెంకట్రామిరెడ్డి ఆదర్శమని సిపిఎం మండల కమిటీ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, మండల నాయకులు రాఘవరెడ్డి, శ్రీరాములు, బజారి, పరమేష్, నాయకులు మహబూబ్బాషా తదితరులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

నేడు కర్నూలులో అంత్యక్రియలు : కర్నూలు హౌసింగ్బోర్డు కాలనీలో ఆయన నివాసంలో వెంకట్రామిరెడ్డి భౌతికకాయాన్ని ఉంచారు. సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు జొహరాపురం హిందూస్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహింస్తారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

విద్యార్థుల జీవిత వెలుగు దివ్వెలు ఉపాధ్యాయులు

- ఎపి ప్రయివేట్ స్కూల్స్ మానేజ్మెంట్స్ బెస్ట్ టీచర్ అవార్డ్స్ - 2023

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కొన్ని గ్రామాలను విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపే దివ్వెలు ఉపాధ్యాయులు అని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ మానేజ్మెంట్స్ అసోసియేషన్ కర్నూలు జిల్లా యూనిట్ తరుపున నిర్వహించిన బెస్ట్ టీచర్ అవార్డ్స్ - 2023 కార్యక్రమానికి కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, ఎంపీ సంజీవ్ కుమార్, నగర మేయర్ బివై.రామయ్య ముఖ్య అతిథులుగా హాజరై అవార్డులను అందజేశారు. వారు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమైనదని అన్నారు. బెస్ట్ టీచర్స్ అవార్డ్ అందుకున్న ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యను ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కేవలం విద్యతో మాత్రమే విదేశాల్లో నలుమూలాల వైపు మన కర్నూలు విద్యార్థులు ఉన్నంత స్థాయిలో ఉన్నారని తెలిపారు. మన జీవితాల్లో వెలుగు నింపేది విద్య మాత్రమేనని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థిని విద్యలో తీర్చిదిద్దే విధంగా కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు అభినందించారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్ మేనేజిమెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి పుల్లయ్య, నాయకులు సుబ్బయ్య, జనార్ధన్ రెడ్డి, వాసుదేవయ్య, కర్నూలు జిల్లా యూనిట్ ఉపాధ్యాయులు కరెస్పాండెంట్లు, వైసిపి నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లాప్ ఆటో డ్రైవర్లు కార్మికులా? కట్టు బానిసలా?

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి. నిర్మల్మ

క్లాప్ ఆటో డ్రైవర్లు కార్మికులా లేక కట్టు బానిసలా? అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.నిర్మల ప్రశ్నించారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ క్లాప్ డ్రైవర్లను పనిలోనికి తీసుకుని పెండింగ్ జీతాలు ఇవ్వాలని జరుగుతున్న పోరాటంలో భాగంగా రెడ్డి ఏజెన్సీ మేనేజర్లు తన్వీర్, మహబూబ్ బాషలు, కార్మిక సంఘం నాయకులు సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, అంజిబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.నిర్మల, విజయ రామాంజనేయులు, కార్మికులకు కార్మిక కర్షక భవన్లో చర్చలు జరిపారు. చర్చల విషయాలను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.నిర్మల కార్మికులకు వివరిస్తూ క్లాప్ డ్రైవర్లకు జీతాలు వచ్చిన రాకపోయినా, పిఎఫ్, ఇఎస్ఐ, కార్మిక చట్టాలు అమలు కాకున్నా అడగకుండా ప్రశ్నించకుండా నిరసనలు రాస్తారోకోలు చేయకుండా తలదించుకుని పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఒప్పంద పత్రం పంపించారని, ఆ పత్రంలో ఉన్నదానికి ఒప్పుకొని సంతకం చేసిన వారు మాత్రమే పనికి వస్తారని మిగిలిన వారు అవసరం లేదని చెప్పడం బాధాకరమన్నారు. 91 ఆటోలకు 98మంది డ్రైవరన్న లు వారికి పెండింగ్ జీతాలు ఇవ్వాకుంటే వారి కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ఆమె ప్రశ్నించారు. నెలలు తరబడి పెండింగులో ఉన్న జీతాలు అగ్రిమెంట్ ప్రకారం జీతం, పిఎఫ్, ఇఎస్ఐ కార్మిక చట్టాలు అమలు చేయాలని పోరాటం చేస్తున్న వారికి ఏజెన్సీ వారు కమిషనర్ పట్టి పట్టనట్టు ఉండడం దారుణమన్నారు. మున్సిపల్ కమిషనర్ ఒక ఐఎఎస్ అధికారిగా చట్టాలు అమలు చేయకుండా నియంతలా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు గాని కార్మికులు గాని తమ సమస్యలు పరిష్కారం కానప్పుడు నిరసనలు తెలపడం చట్టబద్ధమని ఆమె గుర్తు చేశారు. కమిషనర్ స్వచ్ఛ కర్నూలుగా ఉంచాల్సిన మన నగరాన్ని క్లాప్ ఆటో డ్రైవర్లను పనిలోనికి రానియ్యానందున కంపు కర్నూలుగా మారిందన్నారు. నగరంలో చాలామందికి మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు వస్తున్నాయన్నారు. కాబట్టి కమిషనర్హోదాకు తగ్గట్టు ఆలోచించి క్లాప్ ఆటో డ్రైవర్ల అందరిని పనిలోనికి తీసుకుని తక్షణమే పెండింగ్ జీతాలు ఇప్పించాలన్నారు. అగ్రిమెంట్ ప్రకారం జీతం, పిఎఫ్, ఇఎస్ఐ వీక్లీ ఆఫ్ లు అమలు చేయాలన్నారు. చనిపోయిన కార్మిక కుటుంబాలకు ఎక్స్గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు కుమార్, ఇస్మాయిల్, క్లాప్ ఆటో కార్మికులందరూ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు ప్రభాకర్, వేదికపై సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నాయకులు

ఐక్యపోరాటాలతోనే గుండ్రేవుల సాధ్యం

ప్రజాశక్తి-సి బెళగల్

ఐక్యపోరాటాల ద్వారానే గుండ్రేవుల ప్రాజెక్టు సాధ్యమవుతుందని ప్రతిపక్ష పార్టీల నాయకులు టిడిపి కోడుమూరు ఇన్ఛార్జి ప్రభాకర్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రసూల్, సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు కృష్ణ, కాంగ్రెస్ ఒబిసి చైర్మన్ తిరుపాల్, సిపిఎం డివిజన్ నాయకులు జె.మోహన్, టిడిపి మండల కన్వీనర్ గోవింద్గౌడ్ లు పేర్కొన్నారు. ఆదివారం సొసైటీ ఆవరణలో జరిగిన సమా వేశంలో కర్నూలుకు, కోడుమూరు నియోజకవర్గాలకు గుండ్రేవులనే ఆధార మన్నారు. వారు మాట్లాడుతూ తుంగభద్ర నదికి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలంటే గుండ్రేవుల తప్పమార్గం లేదని, ఏటా 300 టిఎంసిల నీరు సముద్రంపాలవుతుందన్నారు. ఏళ్లుగా వామపక్ష పార్టీల పోరాట ఫలితంగా కాంగ్రెస్, టిడిపిల హయాంలో సర్వేలకే పరిమితం చేశారన్నారు. రాష్ట్ర విభజనలో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, జిల్లాల విభజనలో కర్నూలును పూర్తిగా విస్మరించారని, అందులో కోడుమూరు నియోజకవర్గంలోని సి.బెళగల్, మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి వలసలు కానరావడం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా గుండ్రేవుల డ్యామ్ నిర్మాణానికి నిధులు కేటాయించి తక్షణమే పనులు మొదలుపెట్టాలని డిమాండ్ చేశారు.

హామీలు అమలులో వైసిపి ప్రభుత్వం విఫలం : ఆవాజ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వైసిపి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఆవాజ్ నగర కమిటీ అధ్యక్ష ,కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్,షేక్ మొహమ్మద్ షరీఫ్ విమర్శించారు. ఆదివారం వారి కార్యాలయంలో ఆవాజ్ నగర కమిటీ సమావేశం ఆవాజ్ కమిటీ గౌరవ అధ్యక్షులు ఎస్.ఇస్మాయిల్ అధ్యక్షతన నిర్వహించారు. ఉర్దూ విద్యాలయ అభివృద్ధి, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ సిబ్బంది ,నిధుల విడుదల తదితర సమస్యలతో పాటు, వైసిపి ప్రభుత్వం ఇచ్చిన, హామీలు అమలు తదితర అంశాలపై నాయకత్వం చర్చించింది. పి ఇక్బాల్ హుస్సేన్, మహమ్మద్ షరీఫ్ మాట్లాడారు. ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేస్తానని చెప్పిన జగన్ దాని ఊసే ఎత్తడం లేదన్నారు. మాట తప్పననీ, మడమ తిప్పనని, చెప్పే సిఎం జగన్ దీన్ని ఏమంటారని ప్రశ్నించారు. దుల్హన్ పథకానికి అమలు చేయడానికి ,నాలుగు సంవత్సరాలు పట్టిందని, అందులో అనేక షర తులు పెట్టి పథకాన్ని మైనార్టీలకు అందకుండా కుట్రలు చేసింది జగన్ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. మతోన్మాద బిజెపికి ఎక్కడ చెయ్యి ఎత్త మంటే అక్కడ చెయ్యి ఎత్తి ఏ బిల్లు అమలు చేయాలంటే ఆ బిల్లు అమలు చేస్తూ నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి మతోన్మాద బిజెపికి వైసిపి ప్రభుత్వం వంత పాడుతున్నది వాస్తవం కాదా అని ధ్వజమెత్తారు. రాజకీయాల కతీతంగా ముస్లిం మైనార్టీలు ఐక్యం కావాలన్నారు. నగర నాయకులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల హక్కుల సాధనకు ఉద్యమం : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు

హమాలీ కార్మికులకు సంక్షేమ నిధి, వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి కార్మికులకు గుర్తింపు కార్డులు, పని భద్రత, ప్రమాద బీమా, కార్మికుల హక్కుల కోసం ఉద్యమిద్దామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు అన్నారు. ఆదివారం కార్మిక కర్షక భవన్లో వేర్హౌస్ హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. వేర్ హౌస్ హమాలియూనియన్ అధ్యక్షులు ఇ.విధేయుడు అధ్యక్షతన వహించారు. ఎం.డి అంజిబాబు, సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు, సిఐటియు నగరనాయకులు టి.రాముడు, ఎం. గోపాలు కార్మికులను ఉద్దేశించిమాట్లాడారు. హమాలీ కార్మికులు ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు 12 గంటల నుండి 18 గంటల వరకు మూటలు మోస్తూ వచ్చిన ఆదాయంతో తమ కుటుంబాలను పోషించుకుంటూజీవనం కొనసాగిస్తున్నారన్నారు. కష్టించి పనిచేసే కార్మికుల గురించి కేంద్రంలోని నరేంద్ర మోడీ, రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ల ప్రభుత్వాలు కార్మికుల కష్టసుఖాల గురించి వారి సంక్షేమం గురించి ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఒక చోటు నుంచి ఇంకో చోటికి సరుకులు రవాణా కావాలంటే ముఠామేస్త్రిలు చాలా ముఖ్యమన్నారు. ముఠామేస్త్రిల సంక్షేమం గురించి , పనిభద్రతకల్పించడంలో గుర్తింపు కార్డులు, ప్రమాదబీమా, సంక్షేమ నిధి ఏర్పాటు చేయడంలో చాలా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు, గ్యాస్, పెట్రోలు, డీజలు, కరెంటు చార్జీలు ఇంటి పన్ను, చెత్త పన్ను వంటివి మోయలేని భారాలు వేసి కార్మికుల కుటుంబాలను ఆర్థికంగా వెనకపాటుకు గురి చేస్తున్నారన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక: నూతన కమిటీని 8 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వేర్ హౌస్ హమాలీ యూనియన్ అధ్యక్షుడిగా ఇ.విజయుడు, కార్యదర్శిగా జయన్న, జాయింట్ సెక్రెటరీగా ఎన్.నాగరాజు, వైస్ ప్రెసిడెంట్గా ఎం.చెన్నయ్య, కమిటీ సభ్యులుగా శేఖర్, సామేలు, చెన్నయ్య, ఎన్నికయ్యారు. ఈకార్యక్రమంలోహమాలీకార్మికులుపెద్ద సంఖ్యలోపాల్గొన్నారు.

పత్తికొండ మార్కెట్ యార్డ్ అభివృద్దే ధ్యేయం

మార్కెట్ యార్డు సెక్రెటరీ కార్నోలిస్

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి పాలకవర్గంతో పాటు తాము ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పత్తికొండ మార్కెట్ యార్డ్ సెక్రెటరీ కార్నోలిస్ ప్రజాశక్తితో వివరించారు.ఆయన మాటల్లో....పత్తికొండ మార్కెట్ యార్డ అభివద్ధికి రూ.1.80 లక్షలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో ప్లాట్ ఫారంలు ఏర్పాటు చేస్తాం. త్వరలోనే ఆన్లైన్ టెండర్లు వచ్చిన వెంటనే పనులు ప్రారంబిస్తాం. ఈ ఏడాది మార్కెట్ యార్డుకు రూ.75 లక్షలు నిర్ణయించారు. ఇప్పటికే రూ.26 లక్షలు సాధించాం. ఈ ఏడాది మార్చి ఆఖరిలోపు లక్ష్యం చేదించే ప్రక్రియలో ఉన్నాం. గతేడాది రూ.52 లక్షలు గాను రూ.62 లక్షలు సాధించాం. పత్తికొండ మార్కెట్ యార్డులోని వారాంతపు సంతతో పాటు, టమోటా, కూరగాయలు విక్రయాలు జరుగుతాయి. రైతులు పంట దిగుబడులను అమ్ముకుంటున్నారు. మార్కెట్ యార్డ్లోని రైతులు తాము తెచ్చిన పంట దిగుబడులను అమ్ముకోవడానికి షెడ్లు ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నాం.

గ్రంథాలయ తాతయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

గ్రంథాలయ తాతయ్యగా పిలుచుకునే ముచ్చుకోట వెంకటరామయ్య జయంతి ఉత్సవ సభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. కర్నూలు పింగళి సూరన తెలుగు తోటలో జరిగిన ఈ సభకు కావెం సుబ్బలక్ష్మి అధ్యక్షత వహించారు. ఆంధ్రదేశంలో గ్రంథాలయ ఉద్యమంలో విశేష కృషి చేసిన మహనీయుడు ఆంధ్ర గ్రంథాలయాన్ని స్థాపించిన ఆయనకు గాడిచర్ల హరిసర్వోత్తమరావు వంటి వారి కోవలో గ్రంథాలయ సేవ చేసి కీర్తి గడించిన వారు ముచ్చుకోట వెంకటరామయ్య అని జెఎస్ఆర్కె.శర్మ తెలిపారు. వారి శ్రీరామ శతకం అనే పద్య రచనను గురించి డాక్టర్ పార్వతి దేవి సమీక్షిస్తూ వెంకటరామయ్య తెలుగు సంస్కృత భాషల్లో పండితులని అన్నారు. ముఖ్యఅతిథి శతావధాని డాక్టర్ ఆముదాల మురళి మహాభారతం సభాపర్వం గురించి చక్కటి ప్రసంగాన్ని ఇచ్చారు. తండ్రి ఉత్తమ గతుల కోసం ధర్మరాజు అశ్వమేధ యాగం చేశాడని, ఆ కోవలో తండ్రిని స్మరిస్తూ ముచ్చుకోట వెంకటచంద్రశేఖర్ సభను ఏర్పాటు చేయడం సముచితమని అన్నారు. మహాభారతం సభా పర్వం మహాభారత కథ అంతా జరగటానికి బీజం వంటిదన్నారు. ఇదంతా బిడ్డలను తల్లిదండ్రులు ఎలా బాగుపరిచాలి. వాళ్లకు ఎలా ధర్మాలు నేర్పాలి. తమను తాము జయించే ఉత్తమ మార్గాన్ని ఎలా నేర్పాలి అన్నది సభా పర్వంలో స్పష్టంగా చెప్పబడిందన్నారు. ధర్మరాజుకు నారదుడు

ముచ్చుకోట వెంకటరామయ్య చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న అథితులు

తెలిపిన రాజనీతి చాలా ప్రసిద్ధమైనదని అది నేటి పాలకులందరికీ అనుసరణీయమైనదని ఎంతో దూర దృష్టితో వ్యాసుడు ఆనాడు జయ కావ్యాన్ని రాయగా నన్నయ్య దానిని అంతే గొప్పగా తెలుగు వాళ్లకి అందించాడని శతావధాని మురళి అన్నారు. సభాపర్వం స్వరూప స్వభావాలను కళ్ళకు కట్టినట్టుగా వర్ణించారు. ఈ సభలో ముచ్చుకోట వెంకటరామయ్య, మేడూరు దీక్షితులు, వెంకటసుబ్బయ్యలను పూలమాలతో సత్కరించారు. లక్ష్మయ్య, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, డాక్టర్ వి.పోతన్న ,ఎలమర్తి రమణయ్య, సూర్యశ్రీ చంద్రమౌళిని సవ్వప్ప గారి ఈరన్న, ఓర్వకల్లు సంజీవరెడ్డి డాక్టర్ రమణయ్య సయ్యద్ జహీర్ మల్లు వెంకట్ రెడ్డి ఇలా ఎందరో ప్రముఖులు హాజరయ్యారు.

అంధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

ఆత్మవిశ్వాసంతో ఉన్నత స్థాయికి చేరాలి

- సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ
-అక్షిత అంధుల పాఠశాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : అంధత్వంతో ఉన్నవారు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్బి.శంకర్శర్మ అన్నారు. కర్నూలు నగర సమీపంలోని పసుపుల రహదారిలో ఉన్న అక్షిత అంధుల పాఠశాల విద్యార్థులకు ఆయన తనవంతు సహాయంగా నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. అక్షిత అంధుల పాఠశాల నిర్వాహకులు సుధాకర్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ శంకర్శర్మ మాట్లాడుతూ మనిషి పంచేంద్రియాలలో అంధత్వమున్నవారు బాధపడాల్సిన అవసరం లేదన్నారు. ఆత్మవిశ్వాసంతో దాన్ని జయించి అందరికీ ఆదర్శంగా నిలిచిన వారు ఎంతో మంది ఉన్నారని చెప్పారు. కంటి చూపు లేని వారు సహజంగా బాధపడుతూ కనబడతారని,కానీ అక్షిత అంధుల పాఠశాలలో అలాంటి భావం ఎవరిలోనూ కనిపించడం లేదన్నారు. అది వారి ఆత్మవిశ్వాసానికి నిదర్శనమని చెప్పారు. కంటి చూపు లేని వారిలో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు బ్రెయిలీ లిపి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దానిద్వారా ఎంతోమంది ఉన్నత చదు వులు చదివి జీవితంలో స్థిరపడి ఇతరులకు సహాయం చేస్తున్నారని చెప్పారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఎంతో కొంత సొంత లాభాన్ని మానుకొని ఇతరుల సేవకు కొంత మొత్తాన్ని వెచ్చించాలని సూచించారు. అక్షిత అంధుల పాఠశాల విద్యార్థులకు నెల రోజులకు సరిపడా నిత్యవసర వస్తువులను అందజేశానని, భవిష్యత్తులోతన సహకారం కొనసాగు తుందన్నారు. యోగ, ధ్యానం వంటి అంశాలలో సాధన చేయించడం ద్వారా వారిలో మరింత ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు.

సి బెళగల్ చెరువులో టిడిపి నాయకుల జలదీక్ష

ప్రజాశక్తి-సి బెళగల్



సి బెళగల్ చెరువులో టిడిపి నేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి నాయకులు కోడుమూరు ఇంచార్జి ప్రభాకర్, మండల కన్వీనర్ గోవింద్ గౌడ్, మాజీ కన్వీనర్ పాండురంగన్న గౌడ్, పోలకల్ గంపరాజు వెంకటేష్, మాజీ సర్పంచులు చిన్న మునెప్ప, కృష్ణయ్య యాదవ్, సంఘాల వెంకటేష్, శరత్, రాజు ఎంపిటిసి రవికుమార్, ముస్లిం మైనార్టీ మండల నాయకులు దూద్ వలి, రెడ్డి సంఘం డివిజన్ నాయకులు ఆదిత్య రెడ్డి తదితరులు ఆదివారం జలదీక్ష చేపట్టారు. **కర్నూలు హాస్పిటల్ :** టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో రెడ్డి గారి తిరుమలేష్ రెడ్డి, పెద్ద బీచుపల్లి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు

ఉద్యోగ, కార్మికులపై నిర్బంధాలు ఆపాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక ఉద్యోగులపై నిర్బంధాలు మానుకొని వారి అభివృద్ధికి కృషి చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో కార్మికుల విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి 4 కార్మిక కోడ్‌ను తీసుకరావడంతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పోలీసులతో అక్రమ కేసులు పెట్టించి వేధిస్తున్నాడని, నిర్బంధాలు, నోటీసులు ఇచ్చి భయపెడుతున్నారని అన్నారు. సిఎం జగన్ ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నిర్బంధాలు వ్యతిరేకంగా ఉద్యోగులు కార్మికులు ఉద్యమించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో చేతి వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సి గోవిందు, సిఐటియు డివిజన్ కార్యదర్శి బి రాముడు, నాగలక్ష్మి, రాజు, జె నాగరాజు, అమోష్, సాబీర్, కేశన్న, సాల్మన్, చిదానందం, యుఎం నాగ లక్ష్మి, సుజాత, సుజాత, మున్ని, పల్లవిరాజు, మోహన్ దాసు పాల్గొన్నారు.

వలసల నివారణలో ప్రభుత్వం విఫలం : తిక్కారెడ్డి

వలసలు వెళుతున్న రైతులను పరామర్శిస్తున్న తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

వలసలను నివారించడంపై రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని టిడిపి నియోజకవర్గ ఇంచార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక రాఘవేంద్ర సర్కిల్ మీదుగా తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక వాహనంలో వలసలు వెళుతున్న కోసిగి మండల పరిధిలోని నేలకోసిగి గ్రామానికి చెందిన సుమారు ఐదు కుటుంబాల వారు వెళుతున్న సమయంలో గమనించిన ఆయన వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా వలసలు వెళ్తున్న మహిళలు వర్షాలు లేక పంటలు ఎండుతున్నాయని ఏమీ చేయలేయాలో తెలియక చేసిన అప్పులను తీర్చేందుకు తెలంగాణకు వలసలు వెళ్తున్నామని వాపోయారు. దీనిపై స్పందించిన ఆయన టిడిపి పాలనలో వలసలు నివారించేందుకు ఉపాధి హామీ పనులు చేపట్టి, వారి పిల్లలకు ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైసిపిని ఓడించడానికి అన్ని వర్గాల ప్రజలు ఎన్నికలను ఎదురు చూస్తున్నారని, ఎన్నికలు ఇప్పుడు వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు.

మంత్రాలయంలో 21న కాంగ్రెస్ బహిరంగ సభ

ప్రజాశక్తి - మంత్రాలయం

నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలో కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ కమిటీ అధ్యక్షులు ఎం. సుధాకర్ బాబు తెలిపారు. ఆదివారం సభ ఏర్పాటుకు స్థానిక హెలిఫ్యాడ్ గ్రౌండ్‌ను నియోజకవర్గ ఇంచార్జీ బాబూరావుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిల భారత కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర కర్నూలు జిల్లాలో ప్రవేశించి ఏడాది అయిన సందర్భంగా నియోజకవర్గ కేంద్రంలో ఈనెల 21వ తేదీన భారీ బహిరంగ సభకు సన్నాహాలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ బహిరంగ సభకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులు హాజరవుతారని చెప్పారు. వారి వెంట కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్ సి బజారన్న ఆదోని కోఆర్డినేషన్ కమిటీ మెంబర్ బి. నీలకంఠప్ప, ఓబీసీ విభాగం జిల్లా చైర్మన్ ఎం. ఖాసిం వలీ, ఓబిసి కార్యదర్శి కోసిగి జిలాని, డిసిసి కార్యదర్శి పెద్దకడబూరు నరసింహులు, యూత్ కాంగ్రెస్ నాయకులు మారుతీ రావు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న నేతలు

మంత్రి జయరాంకు మాతృవియోగం

పలువురు ప్రముఖులు సంతాపం - అశ్శేష జనవహిని మధ్య గుమ్మనూరులో అంత్యక్రియలు

నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి తదితరులు

ప్రజాశక్తి-చిప్పగిరి

రాష్ట్ర కార్మిక ఉపాధి కర్మాగారాల శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంకు మాతవియోగం కలిగింది. ఆదివారం ఉదయం ఆలూరులోని తమ నివాసంలో మంత్రి తల్లి శారదమ్మ (78)హఠాత్తుగా అస్వస్థకు గురై కింద పడిపోయారు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్సల కోసం ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు శారదమ్మ అప్పటికే మతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో ఆలూరు గుమ్మ నూరులో వైసిపి నాయకులు కార్యకర్తలలో విషాదం నెలకొంది. శారదమ్మ పార్థివదేహాన్ని సందర్శనార్థం స్వగ్రామమైన గుమ్మనూరుకు తీసుకొచ్చారు. మృతి వార్త తెలుసుకున్న మంత్రి జయరాం సోదరుడు, కర్ణాటక క్రీడలు, సాంస్కృతిక శాఖ మంత్రి బి.నాగేంద్ర, ఆదోని, మంత్రాలయం ఎమ్మెల్యేలు వై.సాయిప్రసాద్ రెడ్డి, వై.బాలనాగిరెడ్డి, మంత్రి సోదరులు దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, ఆలూరు వైసిపి ఇన్చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి, ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, రాష్ట్ర మాజీ శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, మాజీ టిడిపి ఇన్చార్జులు వైకుంఠం మల్లికార్జున చౌదరి, వీరభద్ర గౌడ్, ఆస్పరి మాజీ జడ్‌పిటిసి కప్పట్రాళ్ల బుజ్జమ్మ, రాష్ట్ర వైసిపి సంయుక్త కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి, చిప్పగిరి జెడ్పిటిసి విరుపాక్షి, చిప్పగిరి ఎంపిపి జూటూరు హేమలత, మండల కన్వీనర్ జూటూరు మారయ్య, దేవనకొండ కిట్టు, గుంతకల్ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి అల్లుడు, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ మంజునాథ్ రెడ్డి, గుంతకల్ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నబాబు, గుంతకల్ ఎంపిపి మాధవి, మోహన్, యువజన అధ్యక్షులు అధ్యక్షులు విక్రాంత్ రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి నియోజకవర్గంలోనే ఆయా గ్రామాల సర్పంచులు,ఎంపిటిసిలు వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు సీనియర్ వైసిపి నాయకులు కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు పెద్ద ఎత్తున పాల్గొని శారదమ్మ మతికి సంతాపం తెలిపారు. సాయంత్రం నియోజకవర్గంతో పాటు బళ్లారి, గుంతకల్ భారీగా తరలివచ్చిన అశేష జన వాహిని మధ్య తమ సొంతపొలంలో శారదమ్మ అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలు శారదమ్మ గుమ్మనూరు సర్పంచిగా ప్రజలకు సేవలు అందజేశారు.

మైనారిటీలు పథకాలను ఉపయోగించుకోవాలి

- రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వెల్ఫేర్ కార్యదర్శి ఇంతియాజ్ బాషా

మాట్లాడుతున్న ఇంతియాజ్ బాషా

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల కోసం ప్రత్యేకంగా అనేక పథకాలను అమలు చేస్తోందని, పథకాలను ప్రతి ఒక్క మైనార్టీకి పథకం అందేలా కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వెల్ఫేర్ కార్యదర్శి ఇంతియాజ్ బాషా పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఒక భవనంలో ఆదోని ఖాజీ సాబ్ అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా మైనారిటి పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వెల్ఫేర్ కార్యదర్శి ఇంతియాజ్ బాషా, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ డైరెక్టర్ మస్తాన్‌వలి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారిని సబియా పర్వీన్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ నియాజ్ అహ్మద్ , రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ కమిటీ డైరెక్టర్ ఎస్‌ఎంబి హన్ను తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో 8 నుంచి 9 శాతం మైనార్టీలు ప్రభుత్వ పథకాలకు అర్హత కలిగే ఉన్నా మూడు శాతం మాత్రమే దరఖాస్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సంక్షేమ కోసం అభివృద్ధి కోసం సహాయ సహకారం అందిస్తోందని, మైనారిటీలు మాత్రం కొంతమంది దరఖాస్తు చేసుకోకపోవడం విచారకరమన్నారు. విదేశీ విద్య కోసం ప్రతి విద్యార్థికి రూ. 40 నుంచి రూ.50 లక్షల దాకా ప్రభుత్వం ఇస్తుందని దానిని ఎందుకు సద్వినియోగం చేసుకోవడం లేదని అన్నారు. ఆదోనిలో ఉన్న అన్ని సమస్యలను తాను పరిష్కరిస్తానని తాను ఇక్కడే ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహించాలని ఇక్కడి సమస్యలు ఇక్కడి ప్రజల మనస్తత్వం తనకు బాగా తెలుసు అని అన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ రెవిన్యూ పరంగా ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మైనారిటీల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా దృష్టి పెట్టామని మైనార్టీలో వాటిని ఉపయోగంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కాజీ సాబ్ అల్తాఫ్ హుస్సేన్ రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి ఇంతియాజ్ బాషను, ఇతర అధికారులను సన్మానించారు.

రైతు కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : రైతు సంఘం

మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-ఆలూరు

మండల పరిధిలోని అంగస్కల్ గ్రామంలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు ఎన్.జయరాముడు కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇచ్చి, రైతు అప్పులను ప్రభుత్వమే చెల్లించి ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. ఆదివారం అంగస్కల్ గ్రామంలోని రైతు జయరాముడు కుటుంబాన్ని రైతుసంఘం (ఏఐకెఎస్) నాయకులు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలూరు మండలం వర్షాధారంపై పంటలు పండించే రైతులకు సకాలంలో వర్షాలు రాక, అప్పులు చేసి అధిక పెట్టుబడులు పెట్టి చేతికొచ్చిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక తెచ్చిన అప్పులకు వడ్డీలు,కుటుంబాన్ని పోషించుకోలేని రైతు ఆత్మహత్యే శరణ్యం అంటూ ప్రాణాలు వదులుతున్నరన్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌లోనే బ్యాంకులు అప్పులు వసూలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఒకపక్క పెట్టుబడికి లేక, మరోపక్క అప్పుల నోటీసులతో రైతులు సతమతమై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బ్యాంకులు నోటీసులు ఇవ్వడం ఆపేయాలని రైతులను ఇబ్బం దులు పెట్టకుండా, అదనపు వడ్డీలను మాఫీ చేసి సామరస్యంగా అప్పు కట్టించుకోవాలన్నారు. ప్రభుత్వ అధికారులు ఆత్మహత్య చేసుకున్న రైతు జయరాముడు కుటుంబాన్ని ప్రమార్శించి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇచ్చి రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు పి.హనుమంతు,మండల కార్యదర్శి ఈరన్న,గ్రామస్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మల్లప్ప

ఆదోని అభివృద్ధిపై చర్చకు సిద్ధం : జనసేన

ప్రజాశక్తి - ఆదోని

ఆదోన అభివృద్ధిపై రిటైలుగానైనా, హోల్‌సేల్‌గానైనా చర్చకు సిద్ధం అని ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డికి జనసేన పార్టీ ఆదోని ఇన్‌ఛార్జీ మల్లప్ప సవాల్ విసిరారు. ఆదివారం ఆదోనిలోని రిక్రియేషన్ క్లబ్ ఆవ రణలో జరిగిన క్రియాశీలక సభ్యత్వ చెట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈద్గా హామీ నేటికీ అమలు చేయలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ రాష్ట్రంలో అమలు అవుతుందా అని అన్నారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంక్ శిథిలావస్థకు చేరిన శాశ్వత పరిష్కారం చూపడం లేదని విమర్శి ంచారు. టిడ్కో ఇళ్లను నేటికీ ఇవ్వలేదని, రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిగా ఉంటూ ప్రతి గ్రామానికి తాగునీటిని అందజేస్తామన్నారు. ఆదోని అభివృద్ధిపై ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేణువర్మ, చిరుత రాజశేఖర్, రాజశేఖర్, తహేర్ వలీ, పులి రాజు ,ప్రకాష్, జయరాం ఉన్నారు.

జయహో చంద్రయాన్-3 పుస్తకావిష్కరణ

జయహోచంద్రయాన్-3 పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ప్రాథమికోన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్న రచించిన 41వ కొత్త పుస్తకం 'జయహో చంద్రయాన్-3' బాలగేయాల సంపుటిని సికింద్రాబాద్‌లోని హోటల్ కినర గ్రాండ్‌లో ఘనంగా ఆవిష్కరించారు. విశ్రాంత ఫారెస్ట్ అధికారి ఎ.ఎల్.కృష్ణారెడ్డి, విశ్రాంత భూగర్భ శాఖ డైరెక్టర్ డా.వి.డి. రాజగోపాల్, గంటా మనోహర్ రెడ్డి, విశ్రాంత వాణిజ్య పన్నుల శాఖ అధికారి గందె సోమశంకర్ చేతుల మీద పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తకాన్ని రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ కృష్ణారెడ్డికి అంకితమిచ్చారు. అనంతరం బాలసాహిత్యవేత్త సోమన్నను వారి విశేష తెలుగు సాహితీ కృషి గాను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కవులు,ఉపాధ్యాయులు కళాకారులు డి. కేశవయ్య, ఆరెకటిక నాగేశ్వరరావు, రవీంద్ర బాబు, శ్రీపాద శ్రీనివాస్, పాత్రికేయులు పాల్గొన్నారు. సన్మాన గ్రహీత కవిరత్న గద్వాల సోమన్న ను తోటి ఉపాధ్యాయులు, గ్రామస్థులు, శ్రేయోభిలాషులు అభినందించారు.

వైసిపికి ప్రజా కోర్టులోనే శిక్ష : టిడిపి

పుస్తకం విడుదల చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

స్కిల్ ప్రాజెక్టులో రూ.3,300 కోట్ల అవినీతి జరిగిందన్న వారే తర్వాత రూ.330 కోట్లు అవినీతి అని అక్రమ కేసులు పెడుతున్న వైసిపి ప్రభుత్వానికి ప్రజా కోర్టులో శిక్ష తప్పదని టిడిపి నాయకులు పేర్కొన్నారు. మాజీ కేంద్రమంత్రి కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక కోట్ల క్యాంపు కార్యాలయములో స్కిల్ డెవలప్మెంట్‌పై నిందలు వేయడమంటే యువత భవితపై దాడి చేయడమే అనే అంశంపై రాష్ట్ర కమిటీ ముద్రించిన పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం 42 స్కిల్ సెంటర్లను సరిగా నిర్వహించి ఉంటే రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వచ్చి ఉండేవన్నారు. వివేకా హత్య, ప్రజా సమస్యలపై దృష్టి మళ్లించేందుకే చంద్రబాబు, లోకేశ్‌లపై అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. మూడు అంతర్జాతీయ సదస్సులు నిర్వహించి రూ.15.45 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చి 32 లక్షల ఉద్యోగాలకు శ్రీకారం చుట్టిన చంద్రబాబు నాయుడిన అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో ప్రజా కోర్టులో వైసిపికి శిక్ష తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కదిరికోట ఆదెన్న, జి.అల్తాఫ్, ఉప్పర ఆంజనేయులు, కందనాతి శ్రీనివాసులు, మల్కాపురం పురుషోత్తం రెడ్డి, రోజా ఆర్ఫ్ ఉసేని, దర్జీ మోషన్న పాల్గొన్నారు.

మందకృష్ణ పాదయాత్రలో దివాకర్ చైతన్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


పాదయాత్రలో చైతన్య

ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఈనెల 7 నుండి నవంబర్ 7 వరకు అలంపూర్ నుండి హైదరాబాదుకు చేపట్టిన మాదిగల విశ్వరూప పాదయాత్రలో ఎమ్మిగనూరు ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. ఆదివారం ఈ పాదయాత్రకు ఎమ్మిగనూరు నియోజకవర్గం నుండి ఎమ్మార్పీఎస్ ఇంచార్జి గిరి పోగు ఆనంద్ చైతన్య మాదిగ కుమారుడు దివాకర్ చైతన్య ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లి, మందకృష్ణ మాదిగతో పాటు పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలియజేశారు.

ఒక్క ఛాన్స్‌తో మోసం : టిడిపి

శిబిరంలో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

మాట్లాడుతున్న తిక్కారెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీల నెరవేర్చకుండా మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి మీనాక్షి నాయుడు విమర్శించారు. చంద్ర బాబు నాయుడు అరెస్టును ఖండిస్తూ ఆదోని టీడీపీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్‌ఏ మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఆదోనిలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. 'బాబు కోసం మేము సైతం'లో వీర శైవ లింగాయత్, జంగమ సోదరులు, గురవయ్యలు గుళ్ళెం శివరుద్రప్ప, విరుపాపురం కె విశ్వనాథ్, హనవాళు మల్లయ్య, కడితొట్ట రమేష్, కన్య గణేష్, విశ్వనాథ్ గౌడ్, విరుపాక్షప్ప, కోట వీరభద్ర స్వామి గుడి పూజారి మంజునాథ్, హనవాళు సిద్ద లింగయ్య, హనవాళు వీరభద్రయ్యలు సంఘీభావంగా రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. గురువయ్యలు నృత్యం ప్రదర్శన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అని జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంను స్మశానం చేసారని, న్యాయ స్థానాల్లో చంద్రబాబుపై పెట్టిన తప్పుడు కేసులు నిలబడవన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు సాయి బాబు, బసాపురం రామస్వామి, బుద్ధారెడ్డి, లక్ష్మి నారాయణ, బాలాజీ, జయకుమార్, వీరేష్, రంగస్వామి నాయుడు, వెంకటేష్ చౌదరి ఉన్నారు. **మంత్రాలయం :** వైసిపి అరాచక పాలనతో, అక్రమ అరెస్టుల తో, వైసిపి తాటాకు చప్పుళ్ళకు టిడిపి శ్రేణులు భయపడే ప్రసక్తే లేదని మంత్రాలయం టిడిపి నియోజకవర్గ ఇంచార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. రాఘవేంద్ర సర్కిల్లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో కోసిగి క్లస్టర్ 6 పరిధిలోని యూనిట్ సభ్యులు బూత్ ఇంచార్జీ ముఖ్య నాయకులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు ప్రపంచ వ్యాప్తంగా మద్దతుకు పలుకుతున్నారని అన్నారు. వైసిపి ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి ప్రతి పక్ష పార్టీ నేతలపై కేసులు పెట్టి భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి పతనం తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, ఉరుకుంద ఈరన్న ట్రస్టు బోర్డు మాజీ సభ్యులు పూజారి వ్యాసరాజాచార్ తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షులు బాపురం సుదీర్ రెడ్డి,టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప ధని, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటపతి రాజు, కోసిగి మండలం కన్వీనర్ జ్ఞానేష్, క్లస్టర్ ఇన్ చార్జ్ భరద్వాజ్ శెట్టి, బిసి సీనియర్ నాయకులు తోవి రామకృష్ణ, వక్రాని వెంకటేశ్వర్లు, నాడిగేని అయ్యన్న, నాడిగేని రంగన్న, పంపాపతి, కోండగేని వీరారెడ్డి,చావిడి వెంకటేష్, అశోక్ రెడ్డి,రవితేజ శెట్టి, విజయ రామిరెడ్డి,చిన్న భూంపల్లి నరసింహులు, క్రిష్ణా రెడ్డి,చంద్ర, డీలర్ నరసన్న,లక్ష్మీకాంత్, తదితరులు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు :** చంద్రబాబు విడుదల అయ్యే వరకు పోరాటం చేస్తామని టిడిపి నాయకులు సుందర్ రాజు, కొండయ్య చౌదరి, రామదాసు గౌడ్, దయాసాగర్,నేసే మల్లికార్జున అన్నారు. స్థానిక సోమప్ప సర్కిల్‌లో 26 రోజు జరిగిన దీక్షల్లో రిలే నిరాహార దీక్ష లో టిడిపి చేనేత విభాగం నాయకులు నేసే మల్లికార్జున,కామర్థి మహేష్, మిన్నాల్లా, దేవేంద్ర,లక్ష్మన్న తో పాటు మరో కొంత మంది కూర్చున్నారు. కార్యక్రమంలో నాయకులు కొండయ్య చౌదరి, రామదాసు గౌడ్, మిఠాయి నరసింహులు, దయా సాగర్, కలిముల్లా, మల్లికార్జున, హుసేన్‌పీర తదితరులు పాల్గొన్నారు. **ఆలూరు:** రాజకీయ కక్షతోనే చంద్రబాబును అక్రమ కేసులో ఇరికించారని టిడిపి రాష్ట్ర నాయకులు నారాయణ రెడ్డి, నారాయణ, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కురవ జయరాం ఆరోపించారు. ఆలూరులో సామూహిక నిరాహారదీక్ష చేపట్టిన దీక్షలకు జన సేన పార్టీ నాయకులు చత్రపతి, ఐటి కోఆర్డినేటర్ రంజిత్, అరవింద్, చంద్ర, అశోక్ తదితరులు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ అశోక్ యాదవ్, టిడిపి జిల్లా నాయకులు నరసప్ప, భాస్కర్, నాగరాజు, కొమ్ము రామంజి,సోమ శేఖర్ నాయుడు, సర్పంచి ఎల్లప్ప,దేవేంద్ర, రైతు కమిటీ తాలూకా అధ్యక్షులు దేవేంద్రప్ప, దేవనకొండ మాలిక్, పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్, గూళ్యం రామం జినేయులు, ముద్ద రంగయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ చేస్తున్న కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం

దళితుల సమస్యల పరిష్కార వేదిక కెవిపిఎస్

- కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దళితుల సమస్యల పరిష్కార వేదిక కెవిపిఎస్ పనిచేస్తుందని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు దేవ సహాయం పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో కెవిపిఎస్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కెవిపిఎస్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ ఉమ్మడి తెలుగు రాష్ట్రంల ఆవిర్భవించిన సమయ ంలో దళితుల పట్ల వివక్ష ఉండేదని, దానికి వ్యతిరేకంగా కెవిపిఎస్ పోరా టం చేసిందని, హోటలలో రెండు గ్లాసుల పద్ధతి, దేవాలయాల ప్రవేశం అడ్డుకోవడం, గ్రామ చావిడి వద్ద దళితులను అడ్డుకునే వారిని వాటిని అన్నిటిని వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ తాలూకా మండల నాయకులు సుమల ఆంటోనీ, సుమల రాజు, కలుగొట్ల రాజు, రమేష్, రంగన్న, ఈరన్న గౌడ్, నరసింహులు, వినోద్, పెద్దయ్య, సుమల, రామలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

బిసిల జన గణనపై సీఎం తీరు సరికాదు

మాట్లాడిన గుడిసె అది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

బీసీల జనగణనపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరు అసమంజసంగా ఉందని ఆదోని టీడీపీ మాజీ ఇంచార్జ్ గుడిసె అది కృష్ణమ్మ విమర్శించారు. ఆదివారం ఆదోనిలోని మండిగరిలోని స్వగృహంలో ఆమె మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ముందే టీడీపీ శాసనసభలో బీసీ జనగణనపై తీర్మానం చేసిందన్నారు. సీఎం జగన్ ఢిల్లీ పర్యటనలో బీసీ జనగణన గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీహార్‌లో అక్కడి రాష్ట్ర ప్రభుత్వం జనగణన మొదలుపెట్టి పూర్తి చేస్తే.. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం బీసీలపై అక్రమ కేసులు, వేధింపులతో జగన్మోహన్ రెడ్డి మునిగి తేలుతున్నారని విమర్శిం చారు. బీసీ సబ్ ప్లాన్‌తో 139 కులాలకు టీడీపీ సమన్యాయం చేస్తే జగన్ బడ్జెట్‌లో కేటాయించిన నిధులను దారి మళ్లించారని, బీసీలకు ఈ ప్రభుత్వంలో ఏ ఒక్క కులానికి కూడా కార్పొరేషన్ లోన్లు రాలేదని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే బీసీ జనగణన చేపట్టి బీసీల అభివృద్ధికి బాటలు వేస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు గుడి శ్రీరాములు, వడ్డేమాన్ గోపాల్, మాజీ ఎంపీపీ మురళి, ముస్లిమ్స్ మైనార్టీ నాయకుడు సాదిక్ వలి, వెంకటరమణ గౌడ్, గిరిదర్, బాబురావు, నాగేంద్ర, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వెంకటరామిరెడ్డి నేటి తరానికి ఆదర్శం : సిపిఎం

ప్రజాశక్తి - దేవనకొండ

ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వెంకట్రామిరెడ్డి జీవితం నేటి తరానికి ఆదర్శం అని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. తెర్నేకల్ గ్రామానికి చెందిన రిటైర్డ్ లెక్చరర్, మాజీ విద్యార్థి ఉద్యమ నాయకుడు సిపిఎం శ్రేయోభిలాషి వెంకట్రామిరెడ్డి మృతికి దేవనకొండ మండల సిపిఎం కమిటీ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. సిపిఎం జిల్లా నాయకులు బి వీర శేఖర్, మండల నాయకులు రాఘవరెడ్డి, శ్రీరాములు, బజారి, పరమేష్ ఆయన అభిమానులు చేన్నప్ప జగన్నాథంలు మాట్లాడుతూ వెంకట్రామిరెడ్డి చూపిన బాటలో నడిచి ఆయన ఆశయ సాధన కోసం మండల పార్టీ సభ్యులు, కార్యకర్తలు అభిమానులు కృషి చేస్తామని పేర్కొన్నారు. సిపిఎం నాయకులు మహబూబ్ బాషా, అశోక్, యూసుఫ్, సూరి, గాజుల శ్రీనివాసులు, కే.పి.రాముడు, దొడ్డప్ప లక్ష్మిరెడ్డి, బడేశబ్, కుంకనూరు శ్రీనివాసులు, పాండు, రాయుడు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు

నాయకులకు సమస్యను వివరిస్తున్న గ్రామస్థులు

తాగేందుకు బోరు నీరే గతి

- రైతుసంఘం

ప్రజాశక్తి-ఆలూరు

ఏళ్లుగా తాగేందుకు బోరు నీరే గతి అని ముసానహళ్లి గ్రామస్థులు రైతుసంఘం నాయకులతో మొరపెట్టుకున్నారు. ఆదివారం ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె. వెంకటేశులు, జిల్లానాయకులు పి.హను మంతు, మండల కార్యదర్శి యు.ఈరన్న గ్రామంలో పర్యటించి వేదవతి రిజర్వాయర్ నిర్మిస్తే తాగు, సాగునీరు అందుతాయని తెలిపారు. రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలని 9,10,11 న నిట్రవట్టి గ్రామం నుండి ఆలూరు కు రైతు పాదయాత్ర లో పాల్గొని జయప్రదం చేయాలని కరపత్రాలు అందజేశారు. గ్రామస్థులు రైతు సంఘం నాయకులతో తాగునీటి సమస్యను వివరించారు. రైతు సంఘం నాయకులు మాట్లాడు తూ ప్రభుత్వాలు,పాలకులు ఓట్ల పైన ఉన్న శ్రద్ధ ప్రజలకు తాగు నీరు అదించడంలో చూపించాలని తెలిపారు. వేల కోట్ల రూపాయలు వృధా చేస్తున్న ప్రజలకు కావలసిన తాగునీరు అందించలేని ప్రభుత్వాలు ఎందుకని అన్నారు. సచివాలయానికి రూ.20 లక్షలు గ్రాంట్ వస్తుందని గడప గడపలో చెప్పిన మంత్రి నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. తాగు నీటి సమస్యను పరిష్కరించని యెడల ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

జనసేనలో చేరిన రమేష్ యాదవ్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనికి చెందిన బిసి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ యాదవ్ జనసేన పార్టీలో చేరారు. ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డికి అనుచరుడుగా ఉంటూ ఇటీవలనే వైసిపికి రాజీనామా చేసి రమేష్ యాదవ్ తటస్థంగా ఉన్నారు. ఆదివారం రమేష్ యాదవ్ మాట్లాడుతూ విజయవాడలోని జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో జనసేన రాష్ట్ర నాయకుడు నాదెండ్ల మనోహర్ కండువాతో తనను ఆహ్వానించారన్నారు. ఆదోని నియోజకవర్గం లో జనసేన పార్టీ నాయకులను సమన్వయం పరుచుకొని పార్టీ బలోపేతం దిశగా అడుగులు వేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

పిఎస్ మూర్తి స్వామికి నివాళ్లు

ప్రజాశక్తి - ఆదోని

ఆదర్శమూర్తి ఆదోని ఆర్ట్స్ కాలేజీ విశ్రాంత ఆంగ్ల అధ్యాపకులు పిఎస్ మూర్తి స్వామి ఆదివారం హైదరాబాద్‌లోని స్వగృహంలో మరణించడంపై పలువురు ప్రముఖులు నివాళ్లు అర్పించారు. ఆదోనిలోని మండిగిరి స్వగృహం చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపి రెండు నిముషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆదోనిలో బంధువులు మాట్లాడుతూ మూర్తి పార్థీవ దేహాన్ని సోమవారం ఆదోనిలోని మండిగిరి స్వగృహంకు తీసుకొచ్చి అంత్య క్రియలు జరుపుతున్నట్లు తెలిపా రు. లలిత కళా సేవా సంస్థ ప్రతినిధులు డాక్టర్ నల్లా రెడ్డి, నటరాజ స్వామి, అప్పాశాస్త్రీ ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - దేవనకొండ

అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవనకొండ మండల ప్రైవేట్ పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానం చేశారు. ఆదివారం కర్నూలు మాంటిస్సోరి పాఠశాలల ఆవరణలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవనకొండ మండలంలోని ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం చేశారు. ఎఫ్ఆర్ హైస్కూల్ పాఠశాలకు చెందిన షబానా బేగం, ప్రకాష్, సరస్వతి విద్యానికేత యూపీ పాఠశాలకు చెందిన నజీర్, జ్ఞాన సుధా యూపీ స్కూల్‌కు చెందిన జ్ఞానేశ్వర్, భారతి యూపీ స్కూల్‌కు చెందిన నజీర్ బాష, పి కోటకొండ పాఠశాలకు చెందిన షణ్ముఖ పావని, వివేకానంద యూపీ స్కూలుకు చెందిన మాదన్న, ఆర్‌విఆర్ పాఠశాలకు చెందిన రమీజాబి, నేతాజీ పాఠశాలకు చెందిన ఆంజనేయులను సన్మానించి దుశ్శాలువ, మెమొంటో అందజేశారు. ఎంపి డాక్టర్ సంజీవ కుమార్, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, ఎమ్మెల్సీ రామ చంద్రారెడ్డి, నగర మేయర్ బివై రామయ్య, ప్రైవేట్ పాఠశాల అసోసియేషన్ వ్యవస్థాపకులు పుల్లయ్య, జనార్దన్ రెడ్డి చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం జరిగింది. ఆయా పాఠశాలలకు చెందిన కరస్పాండెంట్లు పి రఘు నాథ్ ముజీపూర్ రహమాన్, ఉపాధ్యా యులు గోపాల్, సుధా కర్, హుస్సేన్ బాషా, తిప్పన, హేమ, ఉషారాణి పాల్గొన్నారు.

బాధితురాలికు మొబైల్ ఫోన్‌ను రికవరీ చేస్తున్న జిల్లా ఎస్‌పి

జ్వరం పేరుతో దోపిడీ

- అడ్డగోలుగా దోచుకుంటున్న ప్రయివేటు ఆస్పత్రులు
- వైద్యానికి వేలల్లో వసూలు - రోగుల జేబులకు చిల్లు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరిగింది. ఇదే అదునుగా ప్రయివేటు ఆస్పత్రుల రోగుల జేబులు ఖాళీ చేస్తున్నాయి. టెస్టుల పేరుతో డబ్బులు గుంజుతున్నారు. అవసరం లేకపోయినా అడ్మిట్ చేసుకుంటూ వేల రూపాయాల ఫీజులు వసూలు చేస్తున్నారు...

జ్వరంతో ప్రయివేటు ఆస్పత్రికి వస్తే వెంటనే రక్త పరీక్ష పేరిట రూ. 300 నుంచి రూ. 500 వరకు వసూలు చేస్తున్నారు. జ్వరం తగ్గితే సరి.. లేదంటే రకాల టెస్టులు, స్కానింగ్‌లు చేయిస్తున్నారు. రోగి పరిస్థితి తీవ్రంగా లేకపోయినా, మందులు వాడితే తగ్గిపోయే పరిస్థితి ఉన్నా కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు అనవరసరంగా అడ్మిట్ చేసుకుంటున్నాయి. మూడు నాలుగు రోజులు ఆస్పత్రిలో ఉంచుకుని రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు బిల్లు వేస్తున్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రితోపాటు 108 ప్రైవేటు



ఆసుపత్రులు ఉండగా 68 ల్యాబ్లు ఉన్నాయి. ఇందులో 20 వరకు అనధికారికంగా కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రానికి నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, బనగానపల్లి, పాణ్యం నియోజకవర్గాలతోపాటు ప్రకాశం జిల్లా గిద్దలూరు నుంచి బాధితులు వస్తుంటారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయకపోవడంతో ప్రైవేటుకు వెళ్తున్నారు. జ్వరం వచ్చిందంటే చాలు స్కానింగ్, ఎక్స్ రే, డెంగీ, మలేరియా వంటి పరీక్షలు చేస్తున్నారు. అన్ని పరీక్షలు చేయించుకుని రూ.లక్షల్లో ఖర్చుచేసినా సరైన వైద్యం అందక కొందరు ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. పెద్దాస్పత్రిలో కొన్ని పరీక్షలు బయటకు రాసిస్తుండటంతో ఇదే అవకాశంగా రోగులను తీసుకెళ్లి పరీక్షల పేరుతో వేలాది రూపాయలు దోచుకుంటున్నారు. ఆస్పత్రులలో నిబంధనలు పాటించడం లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో వసూలుచేసే ఫీజులు, ఛార్జీల వివరాలను ప్రదర్శించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. అర్హతలేని సిబ్బందిని వైద్యసేవలకు ఉపయోగిస్తున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన వైద్యరోగ్యశాఖ అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ఆస్పత్రిలో ఎంత ఫీజు వేసినా నోరుమూసుకుని కట్టాల్సి వస్తోందని, దీంతో జేబులు ఖాళీ అవుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెల నెలా కమీషన్లు...

కొన్ని డయాగ్నోస్టిక్ కేంద్రాల ప్రతినిధులు వైద్యులకు నెలనెలా కమీషన్లు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు వైద్యులే ల్యాబ్లు పెట్టుకొని వైద్య పరీక్షల పేరుతో దోచుకుంటున్నారన్న విమర్శలున్నాయి. రోగులకు సంబంధించి వైద్య పరీక్షలు చేయాలంటూ వైద్యుడు ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేస్తే అందులో 30 నుంచి 40 శాతం వరకు కమీషన్లు ఇస్తున్నారు.

510 మొబైల్ ఫోన్లు రికవరీ

- బాధితులకు అందజేత - జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ప్రజలు పోగొట్టుకున్న 510 మొబైల్ ఫోన్లను పోలుసులు రికవరీ చేశారు. వీటి విలువ సుమారు రూ. 86 లక్షల 57 వేలు ఉంటుంది. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధితులకు జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి మొబైల్ ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ రెండవ సారిగా చాట్ బోట్ సేవలతో సాంకేతిక పరిజ్ఞానంతో 510 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారన్నారు. మొబైల్ ఫోన్ పోయిన వారు 9121101107 నెంబర్‌కు హాయ్ అని ఎస్ఎంఎస్ చేస్తే ఒక లింక్ వస్తుందని, ఆ లింకును క్లిక్ చేసి పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ వివరాలు నమోదు చేయాలన్నారు. ఏలాంటి రుసుము చెల్లించకుండా ఉచితంగా సెల్ ఫోన్ రికవరీ చేస్తామని తెలిపారు. జిల్లాలోనే అతి తక్కువ సమయంలోనే ఇటీవల వివిధ రాష్ట్రాల నుండి రికవరీ చేసిన 847 మొబైల్ ఫోన్లను మొదటి విడతగా అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం రెండవ సారి 510 సెల్‌ఫోన్లు రికవరీ చేశామన్నారు. డిజిపి, ప్రభుత్వం ఆదేశాల మేరకు మొబైల్ రికవరీ మేళా నిర్వహించామన్నారు. పోలీసు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాధితులు జిల్లా ఎస్పీకి, పోలీసు యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు స్పందన కార్యక్రమం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు నేడు సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో జగనన్నకు చెబుదాం- స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9-30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా జగనన్నకు చెబుదాం- స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రజకుల సమస్యల పరిష్కారానికి పోరాటం

- ఎపి రజకవృత్తిదారుల సంఘం

ప్రజాశక్తి - ఆత్మకూరు

రజక వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఎపి రజకవృత్తి దారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సి.గురుశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్లో ఎపి రజక వృత్తిదారుల సంఘం పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా కన్వీనర్ సి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గడిచిన నాలుగు సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం రజకులకు చేసిందేమీ లేదన్నారు. రజక కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్, డైరెక్టర్లను నియమించినా కార్పొరేషన్కు ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదని తెలిపారు.వృత్తి చెరువులపైన రజకులకే పూర్తి హక్కు ఉండాలని, దేవాలయాలు, ప్రభుత్వ హాస్పిటల్స్, ఇతర డిపార్ట్మెంట్లో ఖాళీగా ఉన్న ధోబి పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు దాటిన రజకులకు పెన్షన్లు ఇవ్వాలని, సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలన్నారు. రజక కార్పొరేషన్ బోర్డు తీర్మానాన్ని కూడా ఈ ప్రభుత్వం గౌరవించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పట్టణ, మండల కేంద్రాల్లో మోడ్రన్ దోబీ ఘాట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అర్హులైన రజకులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి గృహాలు కట్టించి ఇవ్వాలన్నారు. ఈ నెలలో జిల్లాలో, మండలలో రజకుల సమస్యలపై అధ్యయన బృందాలుగా ఏర్పడి పరిష్కారం కోసం ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజశేఖర్, సిఐటియు నాయకులు రణధీర్. రజక వృత్తిదారుల సంఘం నాయకులు పాములపాడు రామకృష్ణ, ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి శ్రీరాములు, గౌరవాధ్యక్షులు పెద్దసుబ్బయ్య, బంగారం, పట్టణ కమిటీ సభ్యులు శివ, కేశవ్, శోభన్ బాబు, బసవయ్య, చిన్న దర్గయ్య, వెంకటరమణ, రవిశంకర్, రాజు, హరినాథ్, సాయిబాబు, వెంకటేశ్వర్లు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సి.గుణశేఖర్

యథేచ్ఛగా నకిలీ రిజిస్ట్రేషన్లు

- ఫోర్జరీ సంతకాలతో పత్రాలు సృష్టి - భూ బకాసురుల చేతుల్లో భూములు హాంఫట్

నకిలీ రిజిస్టర్ చేసిన నేషనల్ హైవే పక్కన స్థలం

ప్రజాశక్తి - ప్యాపిలి

నకిలీ పత్రాలతో రైతుల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకొన్న సంఘటన ప్యాపిలి మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భూములకు ధరలు పెరగడంతో కొందరు ముఠాగా ఏర్పడి రైతులకు తెలియకుండా నకిలీ పత్రాలను సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయిస్తూ కోట్లు దండుకుంటున్నారు. డోన్ మండలం కొత్తకోట గ్రామానికి చెందిన రైతు సుదర్శన్ రెడ్డికి చెందిన నేషనల్ హైవే-44కి ఆనుకొని ఉన్న 373-2 సర్వే నెంబర్‌లో 21 సెంట్ల భూమి ఉంది. ఈ భూమిని అనంతపురం జిల్లా యాడికి మండలం కాసినాయాని పేట గ్రామానికి చెందిన సాకం సోమక్క హైదరాబాద్‌కు చెందిన మధుసూదన రెడ్డికి రిజిస్టర్ చేశారు. గత వారం ప్రజాశక్తి పేపర్లో 'నకిలీ రిజిస్ట్రేషన్' శీర్షికన ప్రచురితమైనా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో నకిలీ రిజిస్ట్రేషన్లు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా నేడు అదే ముఠాకు చెందిన వారు మళ్లీ నకిలీ రిజిస్టర్ చేయించారు. దీని వెనుక పెద్ద ముఠా ఉన్నట్టు సమాచారం. ఇదే ముఠా అనంతపురం జిల్లాలో కూడా అనేక నకిలీ రిజిస్టర్లు చేసినట్లు తెలిసింది. కావున రైతులు నెలకొకసారి ఈసీలో తనిఖీ చేసుకోవాల్సిన అవసరం ఉంది. మిగులు భూములు ఉంటే వెంటనే వారి పేరు మీద రిజిస్టర్ చేసుకోవాలి. వెంగలాంపల్లె పంచాయితీ సెక్రెటరీ మంజుల తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొత్తకోట గ్రామానికి చెందిన పంచాయతీ సెక్రెటరీ శివారెడ్డి సంతకాన్ని కూడా పోర్జరీ చేసినట్లు తెలిసింది. వారిని వివరణ కోరగా తాము సబ్ రిజిస్టర్ కార్యాలయంలో నకిలీ పత్రాలను రద్దు పరచాలని వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. ప్యాపిలి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఇటువంటి నకిలీ రిజిస్టర్లు ఇంకా జరిగినట్లు వినికిడి. కావున ఇటువంటివి పునరావృత్తం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రైతులు, స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.



పంచాయతీ సెక్రటరీ సంతకాన్ని ఫోర్జరీ చేసిన పత్రం



నకిలీ దస్తావేజు రద్దు చేయాలని సబ్ రిజిస్ట్రార్‌కు పంచాయతీ సెక్రెటరీ ఇచ్చిన వినతి పత్రం

కెవిపిఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

పోరాటాల ద్వారానే ఆత్మగౌరవం సాధ్యం : కెవిపిఎస్

ప్రజాశక్తి - కొత్తపల్లి

దళితులు, గిరిజనులు సమాజంలో ఆత్మ గౌరవంగా జీవించాలంటే సామాజిక పోరాటాలతో పాటు ఆర్థిక పోరాటాల ద్వారానే సాధ్యమవుతుందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, కాటికాపరి బేగరీల సంఘం మండల నాయకులు పి.చిన్న చిన్నయ్య అన్నారు. కెవిపిఎస్ ఆవిర్భావ వారోత్సవాల సందర్భంగా ఆదివారం మండలంలోని శివపురం గ్రామంలో కెవిపిఎస్ జెండాను సత్యరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత గిరిజనలు అనేక సంవత్సరాల నుండి వివక్షకు గురవుతూనే ఉన్నారని అన్నారు. ఆత్మగౌరవంతో బతికే పరిస్థితి లేదన్నారు. అనేక గ్రామాల్లో రచ్చబండలు, దేవాలయాలు, మంచినీళ్ల వద్ద, హెూటల్లో వివిధ రకాల వివక్షను ఎదుర్కొంటున్నారని చెప్పారు. కొన్ని గ్రామాల్లో పెళ్లి ఊరేగింపులు చేయడానికి కూడా అవకాశం లేదన్నారు. ఆత్మగౌరవం కోసం చేస్తున్న కెవిపిఎస్ చేస్తున్న పోరాటాలలో దళిత గిరిజనులందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో బేగరీలు సుందర్రావు, పుల్లన్న, ధర్మరాజు, జి రాజు, దేవ సహాయం, సత్యరాజు, వడ్డేమాన్ చిన్నయ్య, మరియమ్మ, ఏసమ్మ, కమలమ్మ, పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని యనకండ్ల గ్రామంలో సూరయ్య ఆచారి (50) విద్యుత్ షాక్‌తో ఆదివారం మృతి చెందాడు. సూరయ్య ఆచారి రేకుల షెడ్డులో పని చేస్తుండగా విద్యుత్ షాక్ కొట్టడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామిరెడ్డి తెలిపారు.

మృతి చెందిన సూరయ్య ఆచారి

బొగ్గులైన్ వాసులకు

సురక్షిత ప్రాంతంలో ఇళ్ల స్థలాలివ్వాలి

- ఎంపీ, ఎమ్మెల్యే ఆస్తుల విలువ పెంచుకునేందుకే ఖాళీ చేయిస్తున్నారు
- అధికారిక కార్యక్రమాలు ఎమ్మెల్యే ఇంటి వద్ద పెడితే లీగల్ నోటీసులు అందుకుంటారు
- నంద్యాల అభివృద్ధి పై చర్చకు సిద్ధం - ఎమ్మెల్యేకు భూమా అఖిల ప్రియ ప్రతి సవాల్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

'ఎంపీ, ఎమ్మెల్యే స్థలాలు ఉన్నాయి.. వాటి విలువను పెంచుకునేందుకే ఆగమేఘాలపై బొగ్గులైన్ వాసులను అక్కడ నుండి ఇళ్లను బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారు.. బాధితులు ఉండటానికి వీలు లేని ప్రాంతంలో కుందూ నది పరివాహక ప్రాంతంలో ఇళ్లు ఇవ్వడం దూర్మార్గం. సురక్షిత ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలి' అని టిడిపి నాయకురాలు, మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ ఘాటు వాఖ్యలు చేశారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని తన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. బొగ్గులైన్ వాసులకు హైకోర్టులో న్యాయం జరిగిందన్నారు. ఇళ్లను కూల్చకూడదని, ఖాళీ చేయించకూడదని హైకోర్టు స్టే ఇచ్చిందని, స్టే తెచ్చిన సీనియర్ న్యాయవాది తాతిరెడ్డి తులసి రెడ్డిని ఆమె అభినందించారు. ఎలాంటి రక్షణ లేని కుందూ నది పక్కన ఇళ్ల స్థలాలు ఇవ్వడం తగదని, వరదలు వచ్చే ప్రాంతం పక్కన ఇవ్వడం బాధాకరమన్నారు. 'మీ తండ్రి ఎమ్మెల్యే హయాంలో కుందూ వెడల్పునకు రైతుల నుండి తక్కువ రేటుకు కొనుగులు చేసిన భూములు అవి.. అయినా కుందూ నది వెడల్పు చేయలేకపోయారు. రూ. 100 కోట్లు ప్రొటక్షన్ వాల్ కోసం వచ్చినా వీళ్ల చేతగాని తనం వల్ల వెనక్కు వెళ్ళాయి. గుడిసెల్లో ఉన్న వాళ్ళను లేపి మళ్ళీ గుడిసెలను కేటాయించడం సిగ్గు చేటు. కనీసం ఇళ్లు కట్టించే శక్తి ఈ ప్రభుత్వానికి లేదా' అని ఆమె ప్రశ్నించారు. 'నంద్యాల అభివృద్ధిపై చర్చకు రమ్మని సవాల్ విసురుతున్న నీకు చెబుతున్నా.. ఎవరిని ఎంచుకుంటావో తేల్చుకో వస్తాం' అంటూ భూమా అఖిల ప్రియ శిల్పా రవికి ప్రతి సవాల్ విసిరారు. రైతుల సబ్సిడీ విత్తనాలను నీ ఇంటి నుండి పంచుతావా.. ఆర్‌బికెలకు వెళ్లి పంపిణీ చేసే సమయం కూడా లేదా.. అధికారులు ఎవరైనా ప్రభుత్వ కార్యక్రమాలు పెడితే లీగల్‌గా నోటీసులు అందుకోవాల్సి వస్తుంది. ఎమ్మెల్యే ఇంటి వద్ద ప్రభుత్వ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ఏమిటి..? టిడ్కో ఇళ్లు కట్టించింది మా ప్రభుత్వంలో.. మీరు ఏమి చేశారు.. సొంత నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పుకొనే ఎమ్మెల్యే నీ ప్లాంట్ మున్సిపల్ స్థలం, నీ ప్లాంటుకు కరెంటు చార్జీలు కట్టేది మున్సిపాలిటీ, చివరకు నీవు తిరిగే వాహనానికి డీజిల్, పెట్రోల్ కూడా మున్సిపల్ నిధులనే వాడే దౌర్భాగ్య పరిస్థితిలో ఎమ్మెల్యే ఉన్నాడు' అని ఆరోపించారు. బొగ్గులైన్ వాసులకు కుందూ పక్కన స్థలం కేటాయించడం సరైంది కాదని, సురక్షిత ప్రాంతంలో భూసేకరణ చేపట్టాలని, అప్పుడే వారిని అక్కడ నుండి ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు. బలవంతంగా ఖాళీ చేయించాలని అధికారులు చూస్తే లీగల్‌గా నోటీసులు అందుకోవలసి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి నాయకులు సీనియర్ న్యాయవాది తాతి రెడ్డి తులసి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భూమా అఖిల ప్రియ

మరమ్మతులకు నోచుకోని మంచి నీటి బోరు

ఎస్‌సి కాలనీలో నీటి ఎద్దడి

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని నేలంపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. కాలనీలోని మంచినీటి బోరు మరమత్తులకు గురి కావడంతో నీటి ఎద్దడి నెలకొంది. వారం రోజులుగా నీరు రాకపోవడంతో ఎస్సీ కాలనీ వాసులు తాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రిజర్వ్ ఫారెస్ట్‌లోకి వెళ్లరాదు

- ఫారెస్ట్ సెక్షన్ అధికారి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - కొత్తపల్లి

నల్లమల్ల అడవులకు సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలు రిజర్వ్ ఫారెస్ట్‌లోకి ఎవరు వెళ్ళరాదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఫారెస్ట్ సెక్షన్ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం కొత్తపల్లి మండలం బలపాలతిప్ప, సిద్దేశ్వరం గ్రామాల ప్రజలకు జానాలగూడెంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. చట్ట విరుద్ధంగా రిజర్వ్ ఫారెస్ట్‌లోకి వెళ్లిన వ్యక్తులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రిజర్వు ఫారెస్ట్ లో ఎక్కువ శాతం అడవి జంతువులు తిరుగుతుంటాయని, వాటికి ఇబ్బంది కలిగించరాదని తెలిపారు. రిజర్వు ఫారెస్ట్‌లో ఎలాంటి జీవాలు మేపుకోవడం చేయరాదన్నారు. సమావేశంలో ఎఫ్‌బిఒ పాములేటి, ఫారెస్ట్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ అధికారి

అలరించిన ఉర్దూ సాహిత్య సమ్మేళనం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలో మస్జిద్-ఎ-రసూల్‌లో శనివారం రాత్రి జరిగిన నాతియా ముషాయిరా (సాహిత్య సమ్మేళనం) ఉర్దూ ప్రియులను అలరించింది. రాష్ట్ర ఇత్తేహాదుల్ ఉలమాయ ఆధ్వర్యంలో జరిగిన ఉర్దూ గేయకారుల నాతియా ముషాయిరాకు హాఫీజ్ ముహమ్మద్ సలీం పర్వేజ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్ఎండి ఫిరోజ్, హైదరాబాదు పీఠాధిపతి సయ్యద్ హుస్సేన్ పీర్, మౌలానా అబ్దుల్ మజీద్, ఇత్తేహాదుల్ ఉలుమా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముఫ్తీ షఫీవుల్లా, ఎన్ ఎం డి షాకీర్,మౌలానా నసీర్ అహమ్మద్, మౌలానా ఖలీల్ అహమ్మద్ , మౌలానా ఇద్రీస్, ప్రముఖ జాతీయ స్థాయి ఉర్దూ గాయకులు, యూపి ప్రతాప్ ఘడ్‌కు చెందిన హాఫీజ్ సిద్దీఖ్, హైదరాబాద్ ఖారి మౌలానా అబ్దుల్ రెహమాన్, నెల్లూరుకు చెందిన హాఫీజ్ ఉస్మాన్, మౌలానా జాకీర్, వెలుగోడు మౌలానా జావీద్ రషాది బెంగళూర్, మౌలానా రఫీ రషాది, సాఫ్ట్‌వేర్ ప్రముఖులు యస్ కె ఖాజా హుసేన్, ఇర్ఫాన్,అలి, నంద్యాల ఉర్దూ కవులు పాల్గొని మధురమైన స్వరంలో ప్రవక్త ముహమ్మద్ (స) గుణగణాలు, జీవిత ఘట్టాలు వివరించారు. అనంతరం కవులకు శాలువా కప్పి మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హాఫీజ్ ముహమ్మద్ సలీం పర్వేజ్ మాట్లాడుతూ ఈ ముషాయిరాల ద్వారా ఉర్దూ భాషా ప్రోత్సహించే బడటమే కాక సాహిత్య మాధుర్యం ఆస్వాదించ బడుతుందని, ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కవులను జ్ఞాపికలతో సత్కరిస్తున్న దృశ్యం

ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యశ్యం

వన్యప్రాణులను సంరక్షించాలి

- డిఆర్‌ఒ హైమావతి

ప్రజాశక్తి - మహానంది

వన్యప్రాణులను సంరక్షించాలని మహానంది డిప్యూటీ రేంజ్ అధికారి హైమావతి తెలిపారు. వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా ఆదివారం మహానందిలో గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అడవులపై, వన్యప్రాణులను రక్షించడం పై అవగాహన కల్పించారు. విద్యార్థులకు తినుబండారాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్టు** : సుండి పెంట కాలనీలో అటవీశాఖ ఆధ్వర్యంలో వన్యప్రాణి వారోత్సవంలో భాగంగా ప్రతిభ పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులు కరుణాకర్, దినకర్, రామకృష్ణ, రాము నాయక్‌లతో ర్యాలీని నిర్వహించారు. అటవీశాఖ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వి.నరసింహులు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎస్.బషీర్ అహమ్మద్, ఎఫ్ఎస్ఓ జే.నాగునాయక్,ఎఫ్బి ఓ సలాం అల్లా, ఆర్. బాలాజీ, జే. రవీంద్రనాథ్ ఠాగూర్, శ్రీశైలం రేంజి సిబ్బంది ప్రొటెక్షన్ వాచర్స్ పాల్గొన్నారు.

సుండిపెంటలో...

ఆళ్లగడ్డలో హ్యాపీ సండే కార్యక్రమాలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని రోటరీ ఆరోగ్య వేదిక వద్ద ఆదివారం హ్యాపీ సండే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరోబిక్స్, జుంబా డాన్స్, యోగాసనాలలో సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ ప్రసాద్ నేత్ర స్థానం ద్వారా కంటి జబ్బులు రాకుండా కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన చిన్నారులకు టౌన్ ఎస్ఐ వెంకటరెడ్డి పాల్గొని బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ రామ్ గోపాల్ రెడ్డి, న్యాయవాదులు రమాదేవి,సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు నిష్పక్షపాతంగా జరగాలి

- జడ్పిటిసి పుల్యాల దివ్య, ఖోఖో చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి

క్రీడా ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న జడ్పిటిసి, ఖోఖో చైర్మన్

ప్రజాశక్తి - పగిడ్యాల

క్రీడా పోటీలను నిష్పక్షపాతంగా జరిపి క్రీడాకారుల ఎంపిక చేయాలని జెడ్పిటిసి పుల్యాల దివ్య, ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి అన్నారు. జిల్లా స్థాయిలో జూనియర్ ఖోఖో పోటీలలో విజయం సాధించిన క్రీడాకారులకు రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు ఆదివారం పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పిటిసి పుల్యాల దివ్య, ఉమ్మడి జిల్లా ఖోఖో చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి హాజరైన ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఒక్కొక్క రంగంలో ఒకరికి గురువు ఉంటారని, ఆ గురువులలో వ్యాయామ ఉపాధ్యాయుల వృత్తి ఎంతో గొప్పదన్నారు. ఎంతోమంది విద్యార్థులు చదువులో రాణించలేకపోయినా వాళ్ళ ప్రతిభను గుర్తించి వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడలో రాణించే విధంగా ప్రోత్సహిస్తారని అన్నారు. క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిస్తే స్పోర్ట్స్ కోటా కింద ఎన్నో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పగిడ్యాలలో ఒక ఇండోర్ స్టేడియం కావాలని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని అడగగా నిధులు మంజూరు చేయించి అది కొద్ది కాలంలోనే స్టేడియాన్ని నిర్మించినట్లు చెప్పారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించినప్పుడే రాణించగలరని సూచించారు. కవి, రచయిత గుంపుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పగిడ్యాల క్రీడాకారులకు పుట్టినిల్లు అని, ఇక్కడి నుంచి ఎంతోమంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి బంగారు పతకాలు సాధించారని చెప్పారు. జడ్పిటిసి పుల్యాల దివ్య, ఉమ్మడి జిల్లా ఖోఖో చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి ఒకప్పటి క్రీడాకారులు కావడం వల్లనే క్రీడలపై మక్కువతో ఖోఖో క్రీడా పోటీల ఎంపిక ఇక్కడ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పెరుమాళ్ళ శేషన్న, ఖోఖో అసోసియేషన్ అధ్యక్షులు శంకర్, సెక్రటరీ ప్రభాకర్, ఉమ్మడి జిల్లా కోచ్ భూపతి, జిల్లా శాప్ కోఆర్డినేటర్ రవికుమార్, క్రీడా శ్రీ తోకల పీతాంబ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోరాహోరీగా తలపడుతున్న ఖోఖో జట్లు

ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి సబ్ జూనియర్ ఖోఖో క్రీడాకారుల ఎంపిక పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 48 పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలలో ఎంపికైన వారు చిత్తూరు జిల్లా యాదమర్రిలో రాష్ట్రస్థాయిలో ఈ నెల 20 నుంచి 22 వరకు జరిగే పోటీలలో పాల్గొంటారు.

తలపడుతున్న ఖోఖో జట్లు

ఆర్‌బికెలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూర్

రైతులు రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని కొట్టాల చెరువు, కురుకుంద గ్రామంలో నూతనంగా నిర్మించిన వైయస్సార్ రైతు భరోసా కేంద్రాన్ని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆరటి తోటలకు ఇన్సూరెన్స్ కల్పించామని, సిద్దాపురం లిఫ్ట్ ఇరిగేషన్ విషయంలో మోటర్లు రిపేర్లు ఉంటే సొంత డబ్బు ఇచ్చి రైతుల పక్షాన నిలిచామన్నారు. అనంతరం రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడిఏ ఆంజనేయులు, ఎంపీడీవో మోహన్ కుమార్, ఎఒ విష్ణువర్ధన్, జడ్పిటిసి శివశంకర్ రెడ్డి, నంద్యాల జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ భరత్ కుమార్ రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు రాజమోహన్ రెడ్డి, ఆత్మకూరు టౌన్ అధ్యక్షులు సయ్యద్ మీర్, గ్రామ సర్పంచ్ మహబూబ్ బి, ఎంపిటిసి రాజ్యలక్ష్మి, కలాం, మార్కెట్ యార్డ్ చైర్మన్ బాల స్వామి, సింగల్ విండో చైర్మన్ సురేష్, ఆత్మకూరు మున్సిపల్ కౌన్సిలర్లు, మండల జెసిఎస్ కన్వీనర్ లక్ష్మి రెడ్డి, నాయకులు నాగేశ్వర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, శేషయ్య, మహబూబ్ బాషా, మోహన్, బందెల బాబు, అలీ భాష, షఫీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

కొబ్బరికాయల నాణ్యతను పరిశీలించాలి : చైర్మన్

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల దేవస్థానంలో భక్తులకు అందించే కొబ్బరికాయల నాణ్యతను తప్పనిసరిగా పరిశీలించాలని దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రపాణి రెడ్డి సిబ్బందికి సూచించారు. ఆదివారం శ్రీశైలం క్షేత్రంలోని కొబ్బరికాయల గోదాము, గణేష్ సదన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల రద్దీకి అనుగుణంగా ముందస్తుగా తగిన స్టాక్‌ను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అప్పుడప్పుడు కొబ్బరికాయల సైజును కూడా పరిశీలించాలన్నారు. అనంతరం గణేష్ సదన్‌లో ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీని, గదులను పరిశీలించారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. గదులు ఖాళీ అయిన వెంటనే శుభ్రపరచి వెంటనే మరో భక్తునికి ఇచ్చే విధంగా చూడాలన్నారు. గణేష్ సదన్‌లో అతవసరమైన మేరకు సూచన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. గణేష్ సదన్ దక్షిణం వైపు రక్షణ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ, సహాయ కార్య నిర్వహణకులు ఫణిదర్ ప్రసాద్, హరిదాసు, శ్రీశైలం ప్రభ ఎడిటర్ డాక్టర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్మన్

బదిరుల పాఠశాలకు క్రీడా పరికరాలు అందజేత

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అయ్యలూరు మెట్ట వద్ద ఉన్న నవజీవన్ బదిరుల పాఠశాలకు అంతర్జాతీయ లయన్స్ సేవా దినోత్సవం పురస్కరించుకుని లయన్స్ క్లబ్ సభ్యులు పోసిన సుబ్బారావు, అవ్వారు గౌరీనాథ్‌ల సౌజన్యంతో క్రీడా పరికరాలు ఆదివారం అందజేశారు. నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు పీవీ సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జి.రవికృష్ణ, నవజీవన్ బదిరుల పాఠశాల వ్యవస్థాపకులు ఫాదర్ మర్రెడ్డి, సిస్టర్ తంగం, లయన్స్ క్లబ్ కార్యదర్శి సోమేశుల నాగరాజు, కోశాధికారి మామిళ్ల నాగరాజు పాల్గొని ప్రసంగించారు. బదిర విద్యార్థులు తమ లోపాన్ని అధిగమించి క్రమశిక్షణతో, అంకితభావంతో, పట్టుదలతో కృషి చేస్తే గొప్ప వ్యక్తులు కావడానికి అవకాశం ఉందని, ఆ దిశలో విద్యార్థులు ముందుకు వెళ్లాలని అన్నారు. అందుకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు వారికి అండగా నిలబడతాయని తెలిపారు. విద్యార్థులకు ఐఎంఎ హెల్త్ కార్డులు అందజేస్తామన్నారు. నవజీవన్ పాఠశాల విద్యార్థులు చిత్రలేఖనంలో, నృత్యంలో మంచి ప్రావీణ్యం కలిగిన వారు ఉన్నారని, క్రీడల్లో కూడా బాగా రాణిస్తున్నారని అభినందించారు. ఫాదర్ మర్రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ కు ధన్యవాదాలు తెలిపారు. నవజీవన్ పాఠశాలకు లయన్స్ క్లబ్‌కు రెండు దశాబ్దాల అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సుధాకర్ రెడ్డి, సోమేశుల నాగరాజు, కోశాధికారి మామిళ్ల నాగరాజు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ఈ పాఠశాలకు తమ వంతు సహకారం అందజేస్తామన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు లయన్స్ క్లబ్ సభ్యుడు మేడం చంద్రశేఖర్ బిస్కెట్ ప్యాకెట్లు, చిక్కి ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, నిర్వాహకులు భాస్కర్, రాజశేఖర్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు అందజేస్తున్న నంద్యాల లయన్స్ క్లబ్ సభ్యులు

యూరియా లోడ్ లారీలను తనిఖీ చేస్తున్న డిఎవో, ఏవో

జిల్లాకు 3 వేల మెట్రిక్ టన్నుల యూరియా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాకు క్రిబ్కో కంపెనీకి సంబంధించిన ఎరువుల వ్యాగన్‌లో 3 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని జిల్లా వ్యవసాయ అధికారి టి. మోహన్ రావు తెలిపారు. ఆదివారం రేక్ పాయింట్‌కు వచ్చిన ఎరువుల వ్యాగన్‌ను ఏవో ప్రసాద్ రావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు 50 శాతం యూరియా 1500 మెట్రిక్ టన్నుల యూరియా మార్క్‌ఫెడ్ ద్వారా ఆర్‌బికెలకు, ఇంకో 1500 మెట్రిక్ టన్నులు ప్రైవేట్ డీలర్లకు కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం యూరియా 6520 మెట్రిక్ టన్నులు, డిఏపి 5343, ఎంఒపి 4051, ఎన్‌పికె కాంప్లెక్స్‌లు 29,437, ఎస్ఎస్‌పి1065 మెట్రిక్ టన్నుల ఎరువులు ప్రైవేట్ డీలర్లు దగ్గర, ఆర్‌బికెలలో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో క్రిబ్కో కంపెనీ సేల్స్ ఆఫీసర్, హ్యాండ్లింగ్ ఆపరేటర్ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ విలేకరి మృతి

ప్రజాశక్తి- కొలిమిగుండ్ల

కొలిమిగుండ్లలోని మాజీ విలేకరి బి గోపాల్ అలియాస్ నిక్కీ గోపాల్ (54) అనారోగ్యంతో అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. గతంలో నేను సైతం విలేకరిగా బి.గోపాల్ మూడు సంవత్సరాలుగా పని చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి : ఎంపిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధికి నిత్యం కృషి చేస్తున్నారని బేతంచెర్ల ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రహిమాన్‌పురం గ్రామంలో రైతుల పొలాలకు వెళ్లే రహదారి నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సహాయ సహకారాలతో మండలంలోని అన్ని గ్రామాలకు లింకు రోడ్లను వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మురళి కృష్ణ, మద్దిలేటి స్వామి మాజీ చైర్మన్ బీరేలి నాగేశ్వర్ రెడ్డి, గూని నాగరాజు, సింగిల్ విండో అధ్యక్షుడు రుద్రవరం నారాయణ, కన్వీనర్ కుంచే తిరుమలేశ్వర్ రెడ్డి, రామానాయుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

అభివృద్ధి పథంలో డోన్ నియోజకవర్గం : వైసిపి

ప్రజాశక్తి - ప్యాపిలి

డోన్ నియోజకవర్గంను అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత మంత్రి బుగ్గనకే చెందుతుందని జడ్పిటిసి శ్రీరామ రెడ్డి, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ పుల్లారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర రెడ్డి, డోన్ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా నారాయణమూర్తి, గజేంద్ర, భువనేశ్వర్ రెడ్డిలు తెలిపారు. ఆదివారం పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసిపికి చెందుతుందని, డోన్ నియోజకవర్గం మూడు వేల కోట్లతో అభివృద్ధి చెందిందని అన్నారు. డోన్‌లో 100 పడకల ఆసుపత్రి, రెసిడెన్షియల్ స్కూల్, పార్కులు, చెరువులకు నీళ్ల నింపడం, ఇంటిగ్రేడ్ మార్కెట్, డ్రైవింగ్ స్కూల్, గోరుకల్లు రిజర్వాయర్ నుంచి మినరల్ వాటర్ ఇంటింటికి కొలాయి, నూతనంగా కేంద్రీయ విశ్వ విద్యాలయం ఇలా అనేకమైన అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. పట్టణంలో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు గురించి వివరించారు. 2024లో మరొకసారి అవకాశం ఇస్తే డోన్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి బుగ్గన చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో బోరెడ్డి రాము, కృష్ణారెడ్డి, జంగం చంద్రయ్య, శ్రీనివాసరెడ్డి, కొండయ్య, రామంజి, ప్రభాకర్ రెడ్డి, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

10లోపు ఇకెవైసి చేసుకోండి : ఎఒ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్ల మండలంలో ఖరీఫ్ సాగు చేసిన పంటలు రైతులందరూ తమ గ్రామ పరిధిలోనే రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి పంట నమోదు సంబంధించి ఈకేవైసీని ఈ నెల 10 లోపల పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి తెలిపారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ మండలంలో 3 వేల మంది రైతులు పంట నమోదు చేసుకున్నా రని, ఇందులో 2060 మంది రైతులు మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారని తెలిపారు. మిగిలిన 940 మంది రైతులు ఈ నెల 10 లోపల తప్పనిసరిగా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రైతులతో ఈ కేవైసీ చేయిస్తున్న ఎఒ

ప్రవక్త జీవితం ఆదర్శనీయం

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

మహమ్మద్ ప్రవక్త జీవితం ఆదర్శనీయమని మౌలానా అబ్దుల్ ఖాదిర్, అచలపేట గురువు డాక్టర్ సత్య నారాయణలు తెలిపారు. ఆదివారం జమాతే ఇస్లామి హిందు సేవా సంస్థ కార్యాలయంలో జమాతే ఇస్లామి హింద్ స్థానిక అధ్యక్షులు ఎంఎం.అలీబేగ్ ఆధ్వర్యంలో ముహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై ప్రత్యేక కార్యక్రమం జరిగింది. కదిరి మౌలానా అబ్దుల్ ఖదీర్ ఉమరి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి కష్టాలలో ఉంటే మానవత్వంతో చేసే సహాయం మతం కంటే గొప్పదన్నారు. . కార్యక్రమంలో హిందూ, ముస్లిములు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - బనగానపల్లె : గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని బనగానపల్లె, కోవెలకుంట్ల గ్రంథాలయ అధికారులు, బషీర్ అహ్మద్, రాఘవరెడ్డి పేర్కొన్నారు ఆదివారం పట్టణంలోని గ్రంథాలయంలో పుస్తక నిక్షిప్త కేంద్రాల కార్యనిర్వాకుల ద్వారా 'స్వచ్ఛ గ్రంథాలయం' కార్యక్రమంను నిర్వహించారు. ఇల్లూరు కొత్తపేట బీడీసీగా ప నిచేస్తున్న కార్యనిర్వాహకుడు వై మదన్మోహన్ రెడ్డి మృతికి గ్రంథాలయ అధికారులు, బీడీసీలు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో నిరుద్యోగులకు విద్యార్థులకు ఉపయోగపడే ఎన్నో పుస్తకాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు శ్రీరాములు, మండలంలోని బీడీసీలు, పాఠకులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలంలోని జూటూరు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. శ్రీశైలం నుండి బెంగళూరుకు వెళుతున్న వోల్వో బస్సు మంత్రాలయం నుండి ఏలూరుకి వెళుతున్న లారీ ఢీ కొనడంతో లారీ డ్రైవర్‌కు కాలు విరిగింది. బస్సులో ప్రయాణం చేస్తున్న ఒకరికి కాలు విరిగింది. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని 108 ద్వారా గాయపడిన వారిని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మరి కొంతమందికి స్వల్ప గాయాలు అయ్యాయి.

బాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ భారీ ర్యాలీ

- అఖిలప్రియను అడ్డుకున్న సిఐ.. ర్యాలీలో ఉద్రిక్తత..

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో ఆదివారం ఆళ్లగడ్డ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. భూమా నివాసం నుంచి అఖిలప్రియ ఆధ్వర్యంలో పాత బస్టాండ్, తహసిల్దార్ కార్యాలయం వరకు జరిగిన ర్యాలీలో పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న భూమా అఖిలప్రియ, ఆమె భర్త భార్గవరామ్ నాయుడులు కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులను నిరసిస్తూ పోలీసులకు వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించారు. సిఐ రమేష్ బాబు ఆమెను స్టేషన్ ప్రాంగణంలోకి రాకముందే అడ్డుకున్నారు. మహిళలు ఫిర్యాదు ఇచ్చేందుకు వస్తే అడ్డుకోవడం ఎంతవరకు సబబని అఖిల ప్రియ సిఐతో అన్నారు. కార్యకర్తలతో తరలివచ్చి వినతిపత్రం ఇస్తామనడం పద్ధతి కాదంటూ సిఐ నిరాకరించారు. ఈ దశలో కార్యకర్తలు నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తతంగా మారింది. కనీసం తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తామని టిడిపి నాయకులు అనడంతో సిఐ పరిమిత సంఖ్యలో కార్యకర్తలను లోపలికి అనుమతి ఇచ్చారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎవరు లేకపోవడంతో అధికారులకు పోస్టు ద్వారా పంపించేందుకు అఖిలప్రియ సిద్ధమయ్యారు. అనంతరం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ భాష, కాంట్రాక్టర్ నన్నే బాయ్ గారి జిలాని, బొమ్మిరెడ్డి, ఎయిర్టెల్ శేఖర్ రెడ్డి, చాగలమర్రి మాజీ సర్పంచ్ అన్సర్ భాష, సల్లా నాగరాజు, గుత్తి నర్సింహులు ,బషీర్,. మాజీ కౌన్సిలర్ రమీజా, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు. **నంద్యాల రూరల్ :** చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 26వ రోజుకు చేరుకున్నాయి. నంద్యాల ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా సాగుతున్న దీక్షల్లో ఆదివారం నంద్యాల నియోజకవర్గ కుమ్మరి శాలివాహన సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దీక్షకు దూదేకుల ఫెడరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ బాబాన్ సంఘీభావం తెలిపారు. దీక్షలో పాల్గొన్నవారికి నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. దీక్షలో శాలివాహన సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, వారి సతీమణి శ్రీదేవి, నంద్యాల నియోజకవర్గ అధ్యక్షుడు కల్లూరి గురునాథ్, యువసేన అధ్యక్షుడు నాగ భూషణం, జిల్లా అధ్యక్షుడు పట్నం రాముడు,ఉమ్మడి జిల్లా సెక్రెటరీ లక్ష్మన్న, బజారప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు తొలగించేంతవరకూ ఆందోళన కొనసాగిస్తామని శ్రీశైల దేవస్థానం మాజీ చైర్మన్ బొంగాల శివరాంరెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరు బస్టాండ్ ఎదురుగా దీక్షా కార్యక్రమాలు కొనసాగాయి. దీక్షలో సుబ్బారాజు, రామకృష్ణ, అన్వర్ ఖాన్, పెద్దన్న, నబీ రసూల్, సుబ్రమణ్యం శెట్టి, నాగరాజు నాయక్, జియా ఉల్లా, నబీ రసూల్, మల్లికార్జున, నరసింహా, ప్రసాద్, సుదర్శన్, మోహన్ రెడ్డి, శ్రీను, ఫకృద్దీన్ తదితరులు కూర్చున్నారు. ఈ కార్యక్రమానికి టిడిపి నాయకులు యుగంధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వేణు గోపాల్, మండల అధ్యక్షుడు శివ ప్రసాద్ రెడ్డి, రాజా రెడ్డి, అబ్దుల్లాపురం బాషా, వెన్న శ్రీధర్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, నాగుర్ ఖాన్, రహం తులా, న్యామతుల్లా, కావేటి శ్రీను, రామూర్తి, రమేష్ గౌడ్, రవీంద్రా, సతీష్ బాబు తదితరులు మద్దతుగా పాల్గొన్నారు. **బనగానపల్లె :** ప్రజల్లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా పేర్కొన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం సమీపంలో రైతు సంఘం నాయకులు జిల్లెల్ల రాజశేఖర్ రెడ్డి, ఇల్లూరు కొత్తపేట రామిరెడ్డి వెంకటాపురం గడ్డం నాగేశ్వర రెడ్డిల ఆధ్వర్యంలో రైతులు నిరాహార దీక్ష నిర్వహించారు. దీక్షలో కూర్చున్న వారికి పట్టణంలోని ప్రముఖులు సంఘీభావం తెలిపారు. దీక్షలో కూర్చున్న రైతులకు, రైతు సంఘం నాయకులకు బిసి ఇందిరా నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. **బేతంచెర్ల :** బేతంచర్లలోని హనుమాన్ నగర్ కాలనీలో టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి ఆధ్వర్యంలో 'బాబుతో నేను' కార్యక్రమం ఆవుల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. రామకృష్ణ, చింతకాయల విజయ్ కుమార్, రాజ్ కుమార్, తిమ్మరాజు, మాధవ, మధు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : పట్టణంలో భారీగా ర్యాలీగా వస్తున్న మాజీ మంత్రి అఖిలప్రియ



నంద్యాల రూరల్ : 26వ రోజు ధీక్షలో పాల్గొన్న కుమ్మరి శాలివాహన సంఘం నాయకులు

ఆత్మకూరు : మాట్లాడుతున్న నాయకులు

బనగానపల్లె : దీక్షలు చేస్తున్న రైతు సంఘం నాయకులు